ప్రజాశక్తి
సోమవారం 24 జూన్ 2024
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి



పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు దోపిడీ పర్వానికి తెరతీశాయి. ప్రభుత్వ నియంత్రణ కరువవడంతో ఫీజుల దందాను కొనసాగిస్తున్నాయి. పార్య పుస్తకాలు, నోట్‌బుక్స్ ధరలనూ విపరీతంగా పెంచేసి తమ గల్లా పెట్టెను నింపుకుంటున్నాయి. ఎక్కడికక్కడ నిబంధనలకు పాతరేస్తున్నాయి. వెరసి ఫీ'జులుం'కు విద్యార్థుల తల్లిండ్రులు హడలెత్తిపోతున్నారు.

ఫీజుల దందా

- ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఇష్టానుసారంగా వసూళ్లు
- పుస్తకాల పేరిట ఎడాపెడా బాదుడు
- లబోదిబోమంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ప్రజాశక్తి - ఆనందపురం, విశాఖపట్నం

జిల్లాలో 1387 పాఠశాలలు ఉండగా 781 ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోనే నడుస్తున్నాయి. ప్రభుత్వ లెక్క ప్రకారం ఒకటి నుంచి పదో తరగతి వరకూ ఆయా పాఠశాలల్లో 3,91,736 మంది ఈ విద్యాసంవత్సరం చదువుతున్నారు. వీరిలో 2 లక్షలా 96 వేల మంది ప్రైవేటు స్కూళ్లలోనే విద్యనభ్యసిస్తున్నారు. ఫీజుల వసూళ్లపై నియంత్రణ లేకపోవడంతో సదరు ప్రయివేట్ యాజమాన్యాల దోపిడీకి అంతేలేకుండా పోయింది. పరీక్షల్లో ఫలితాలు, పేరెంట్స్ అర్హతను బట్టి యాజమాన్యాలు ఫీజుల వసూళ్లకు పాల్పడుతున్నాయి. ఆనందపురం వంటి గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రయివేట్ స్కూళ్లలో సైతం ఫీజులు అధికంగానే ఉన్నాయి. ఎల్‌కెజి విద్యార్థికి గరిష్ఠంగా రూ.40 వేల వరకూ వసూలు చేస్తున్నారు. ఆ మండలంలో ప్రముఖ ప్రైవేటు విద్యాసంస్థల బ్రాంచిలన్నీ దాదాపు ఉన్నాయి. కార్పొరేట్ స్థాయి పాఠశాలలో ఒకటో తరగతి విద్యార్థికి డేస్కాలర్ అయితే రూ.75 వేల వరకు, రెసిడెన్షియల్ విద్యార్థి అయితే రూ.2 లక్షల వరకూ ఫీజు వసూలు చేస్తున్నారు. మిగతా ప్రైవేట్ పాఠశాలల్లో రూ.20 వేల నుంచి 30 వేల వరకూ ఫీజులు తీసుకుంటున్నారు. పుస్తకాలను తమ పాఠశాలలోనే కొనాలని డిమాండ్ చేస్తూ ఒక్కొక్క విద్యార్థి నుంచి సుమారు రూ.10 నుంచి రూ.12 వేలు వరకూ వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ పుస్తకాలు మినహా విద్యార్థికి సంబంధించిన ఇతర పుస్తకాలు, మిగతా 2లో..

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరుగుతుందని డిఆర్‌ఒ కె.మోహన్ కుమార్ మీడియాకు తెలిపారు. ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై దరఖాస్తులను స్వయంగా స్వీకరించి, పరిష్కారం కోసం అధికారులు తగు చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమం ప్రతి సోమవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లో ఉంటుందని, ప్రజలు గమనించాలని కోరారు. ఇంతవరకు ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో జరుగుతున్న 'స్పందన' కార్యక్రమం ప్రభుత్వం మారడంతో ప్రజా సమస్యల పరిష్కార వేదికగా మారిన విషయం తెలిసిందే.

జివిఎంసిలో..

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 24 నుంచి ప్రతి సోమవారం జివిఎంసి ప్రధాన కార్యాలయంలోనూ, అన్ని జోనల్ కార్యాలయాలలోనూ 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్టు నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని పారిశుధ్యం, పట్టణ ప్రణాళిక విభాగం, మొక్కల విభాగం, రెవిన్యూ, యుసిడి, ఇంజినీరింగ్ మొదలగు విభాగాలకు సంబంధించిన సమస్యలను నగర ప్రజలు ఆ కార్యక్రమంలో అర్జీల ద్వారా తెలియజేయవచ్చునని పేర్కొన్నారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి జోన్ 2 పరిధిలో సోమవారం పలు ప్రాంతాలకు తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనుంది. అక్కడకు మంచినీటి సరఫరా చేసే బోని గ్రామం వద్ద ఉన్న గోస్తనీ హెడ్ వాటర్ వర్క్స్ 700 ఎంఎం డిఐ పైపులైన్ వద్ద లీకులు ఏర్పడి మరమ్మతులకు గురైనందున జోన్ 2లో 7, 8 వార్డులలోగల పలు ప్రాంతాలకు సోమవారం తాగు నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని, ఆయా ప్రాంత ప్రజలు సహకరించాలని కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 7, 8 వార్డులలోగల మిథిలాపురి వుడా కాలనీ, పాత మధురవాడ, ఎన్‌జిఒ కాలనీ, ఆర్‌హెచ్.కాలనీ, ముస్లిం కాలనీ, అశోక్ నగర్, తులసి నగర్, హెచ్‌పిసిఎల్ లే అవుట్, లక్ష్మివాని పాలెం, రేవల్లపాలెం, బక్కన్నపాలెం, దుర్గానగర్, చంద్రంపాలెం ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయంగా జివిఎంసి నీటి సరఫరా విభాగం ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సంబంధిత ప్రాంతాలకు సరఫరా చేయనున్నామని వెల్లడించారు.

ఎసిఎ జట్లకు ప్రధాన కోచ్‌ల నియామకం

వార్త 3లో..

10న కోర్కెల దినాన్ని విజయవంతం చేయాలి

వార్త 4లో..

మౌలిక సమస్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి

వార్త 5లో..



సుందరంగా ఎయు ఓపెన్ ఎయిర్ థియేటర్

ఎయు ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో
ప్రదర్శన ఎప్పుడు..?

ఆధునికీకరించి ఆరు నెలలు గడిచినా ఆటలు కరువు

వార్త 2లో..

హాస్టళ్లలో మెరుగైన సౌకర్యాలు

- సొంత భవనాల్లోనే విద్యార్థులకు వసతి
- 'ప్రజాశక్తి'తో అనకాపల్లి జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి అజయ్‌బాబు


ప్రజాశక్తి - అనకాపల్లి

ప్రభుత్వ వసతి గృహాల్లో మెరుగైన సౌకర్యాలున్నాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అనకాపల్లి జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి అజయ్‌బాబు అన్నారు. పలు బిల్లులు ప్రభుత్వం నుంచి కొన్ని నెలలకుగాను రావాల్సి ఉందని, అవివస్తే సంక్షేమం అమలులో మరింత ముందుకు వెళ్తామని తెలిపారు. తనను కలిసిన 'ప్రజాశక్తి'తో ఆయన పలు విషయాలపై మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

జిల్లాలో హాస్టళ్ల పరిస్థితి ఏంటి ?

జిల్లాలో మొత్తం 31 సాంఘిక సంక్షేమ వసతి గృహాలు ఉన్నాయి. వీటిలో పదో తరగతి వరకు ఉన్న హాస్టల్స్ 23, ఇంటర్మీడియట్ వరకూ ఉన్న హాస్టల్స్ 8 ఉన్నాయి. జిల్లాలో మొత్తం 30 ప్రభుత్వ వసతి గృహాలు ఉండగా పాయకరావుపేటలో ఉన్న హాస్టల్ మాత్రమే అద్దె భవనంలో నడుస్తోంది.





భవనాల పరిస్థితి ఎలా ఉంది ?

మొత్తం 31 భవనాల్లో నర్సీపట్నం, చోడవరంల్లోని మూడు భవనాలు కాస్త శిథిలావస్థలో ఉన్నాయి. వాటికి మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ఫీజుల దందా

నోట్ బుక్స్ తమ స్కూళ్లలో కొనాల్సిందేనని యాజమాన్యాలు హుకుం జారీ చేశాయి. బయట మార్కెట్‌తో పోలిస్తే పలు ప్రయివేట్ స్కూళ్లలో ధరలు ఎక్కువగా ఉన్నప్పటికీ తల్లిదండ్రులు తప్పనిసరి పరిస్థితుల్లో అక్కడే కొంటున్నారు. ఒకటో తరగతి విద్యార్థికి సుమారు పదకొండు వేల వరకు పుస్తకాలకు ఖర్చవుతున్నాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు లబోదిబోమంటున్నారు.

కానరాని ఫీజుల పట్టిక

ఫీజుల పట్టికను కచ్చితంగా అమలు చేయాల్సి ఉన్నా అది ఎక్కడా అమలు కాని పరిస్థితి నెలకొంది. పలు పాఠశాలల్లో కనీసం బోర్డు కూడా కానరాని పరిస్థితి. ఫీజుల పేరుతో ఇంతలా దోచేస్తున్నా కనీసం జిల్లా విద్యాశాఖ అధికారులుగానీ, మండల విద్యాశాఖ అధికారులుగానీ అటువైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. అధికారులకు ముడుపులు ముట్టడంతోనే ఇలా చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఫీజుల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

హాస్టళ్లలో మెరుగైన సౌకర్యాలు

తీసుకుంటున్నాం.

ఎంతమంది విద్యార్థులు ఉన్నారు ?

4450 మంది విద్యార్థినీ విద్యార్థులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 3200 మంది ఉన్నారు. ఈ ఏడాది కొత్త అడ్మిషన్లు మరో 400 వరకూ వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం 1750 మంది బాలురు, 1450 మంది బాలికలు ఉన్నారు.

కాస్మోటిక్స్, ఇతర ఛార్జీలు ప్రతినెలా చెల్లిస్తున్నారా ?

మూడు నుంచి ఏడో తరగతి చదివే బాలురకు నెలకు రూ.125, బాలికలకు రూ.130, ఎనిమిది నుంచి పదో తరగతి విద్యార్థులకు బాలురకు రూ.150, బాలికలకు రూ.200, ఇంటర్మీడియట్ విద్యార్థులకు బాలురకు రూ.200, బాలికలకు రూ.250 లెక్కన గత సెప్టెంబర్ వరకూ చెల్లించాం. అక్టోబర్ నుంచి ప్రభుత్వం తరుపున బిల్లులు రావాల్సి ఉంది. విద్యార్థులకు ఆహార బిల్లులు కొంత మేర ఆలస్యం జరుగుతున్నా వార్డెన్ల సహకారంతో ముందుకెళ్తున్నాం. ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో బిల్లులు వచ్చిన వెంటనే అందరికీ చెల్లిస్తాం.



ఒప్పంద పత్రాలతో బిఎస్ఎన్ఎల్, విజ్ఞాన్ ప్రతినిధులు

బిఎస్ఎన్ఎల్‌తో విజ్ఞాన్ ఎంఒయు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దువ్వాడ విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (అటానమస్) కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ బిఎస్ఎన్ఎల్‌తో ఎంఒయు చేస్తుకుంది. కాలేజీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఈ మేరకు బిఎస్ఎన్ఎల్ డిఎంఎ డాక్టర్ ఎం.సత్యప్రసాద్, కాలేజీ అధికారులు ఎంఒయుపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ ల్యాండ్ లైన్ ఫోన్లకు బదులుగా వైర్‌లెస్ కమ్యూనికేషన్ వ్యవస్థ చరిత్ర సృష్టించిందని తెలిపారు. విజ్ఞాన్ విద్యా సంస్థ తమ విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు, నైపుణ్యాలు, విజ్ఞానం పెంపొందించేందుకు బిఎస్ఎన్ఎల్‌తో చేసుకున్న ఒప్పందం దోహదపడుతుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జిసుధాకర్ మాట్లాడుతూ నాణ్యమైన విద్య అందించేందుకు బిఎస్ఎన్ఎల్‌తో ఒప్పందం చేసుకున్నామన్నారు. కార్యక్రమంలో కాలేజీ రెక్టార్ డాక్టర్ వి.మధుసూదనరావు, ఇఎంఇ విభాగం అధిపతి డాక్టర్ సిహెచ్.రమేష్ బాబు, డాక్టర్ ఆర్.ఉమామహేశ్వరి, డాక్టర్ సంపత్, దక్షిణామూర్తి పాల్గొన్నారు.

బిహెచ్ సిరీస్ 56 వాహనాలపై కేసులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : బిహెచ్ సిరీస్ వాహనాలపై తనిఖీలు నిర్వహించి 56 వాహనాలపై కేసులు నమోదు చేశామని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రాజారత్నం ఆదివారం మీడియాకు తెలిపారు. రూ.కోటీ 19 లక్షల పన్నులు, రూ.10 లక్షల అపరాధ రుసుము వసూలు చేశామని పేర్కొన్నారు. బిహెచ్ సిరీస్ నెంబర్లతో ఆంధ్రప్రదేశ్‌లో తిరుగుతున్న వాహనాలకు సంబంధించిన వాహనదారులు వెంటనే పన్నులు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

కండిషన్ లేని బస్సులతో కష్టాలు

ప్రజాశక్తి -సీలేరు : విశాఖ నుంచి సీలేరు మీదుగా భద్రాచలం వెళ్లే అల్ట్రా డీలక్స్ నైట్ సర్వీస్ ఆర్‌టిసి బస్ శనివారం అర్ధరాత్రి సాంకేతిక సమస్య తలెత్తడంతో కారు అడవిలో కటిక చీకట్లో నిలిచిపోయింది. దీంతో బస్సులో ఉన్న ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ప్రతిరోజు విశాఖపట్నం కాంప్లెక్స్‌లో సాయంత్రం 6 గంటలకు బయలుదేరి, సీలేరు మీదుగా భద్రాచలం మరుసటి రోజు ఉదయం 4 గంటల చేరుకునే ఆర్‌టిసి బస్సు, శనివారం సాయంత్రం యథావిధిగా బయలుదేరి రాగా, గూడెం దాటిన తర్వాత లంకపాకల ఘాట్ రోడ్డులో బస్సులో సాంకేతిక లోపాలు తలెత్తి కారడవిలో నిలిచిపోయింది. దీనిపై డ్రైవర్లు అప్రమత్తమై సాంకేతిక లోపాలు పరిశీలించారు. బస్సు ఇంజను, వైరింగ్‌లో సాంకేతిక లోపాలు ఉన్నట్లు గుర్తించి, వాటికి మరమ్మతులు చేపట్టారు. గంటన్నర తర్వాత యథావిధిగా బస్సు వెళ్లడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. కండిషన్ లేని బస్సులతో తరుచూ ఇటువంటి ఇబ్బందులు వస్తున్నాయని వారు అసహనం చెందారు

ఎయు ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో

ప్రదర్శన ఎప్పుడు..?

ఆధునికీకరించి ఆరు నెలలు గడిచినా ఆటలు కరువు


ఓపెన్ ఎయిర్ థియేటర్ ప్రధాన వేదిక

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆంధ్ర యూనివర్సిటీలోని కెవి.గోపాలకృష్ణ యాంపీ ఓపెన్ ఎయిర్ థియేటర్ దయనీయ స్థితిలో ఉంది. హుదూద్ సమయంలో శిథిలావస్థకు చేరిన ఈ థియేటర్‌ను ఎయు బడ్జెట్ నుంచి రూ.50 లక్షలతో మరమ్మత్తులు చేసి ఆధునికీకరించి అందుబాటులోకి తెచ్చినా ప్రదర్శనల జాడ కానరావడం లేదు. ప్రముఖ సినీ హీరో అక్కినేని నాగార్జున, ఆయన కుమారుడు, సినీ హీరో అఖిల్ కలిసి 2023 నవంబర్ 24న ఈ థియేటర్‌ను ప్రారంభించారు. ఆ కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యులు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పునరుద్ధరణ సమయంలో నగరానికి చెందిన ప్రముఖ నాటక రంగ దర్శకుడు, రచయిత ఎల్.సత్యానంద్ సూచనల మేరకు, థియేటర్ ఎత్తును పెంచారు. శాశ్వతంగా సిమెంట్‌తో సీటింగ్ ఏర్పాటు చేశారు. సౌండ్ సిస్టం, స్క్రీన్ డిజైన్ వగైరా వాటిని విదేశాలలో ప్రముఖ థియేటర్ల పద్ధతిలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అంతా బాగున్నా.. సీటింగ్ మధ్యలో కొన్ని ఫోల్స్ అడ్డంగా ఉన్నాయి. వీటిని ఎందుకు తొలగించలేదో అర్థం కాదు. ఈ పోల్స్ ఉండటం వల్లనే ఇక్కడ ప్రదర్శనలు ఇవ్వటం లేదని ఎయు విద్యార్థులు అంటున్నారు. ఈ అవరోధాన్ని తొలగించాలని వారు కోరుతున్నారు.

విశిష్టమైన చరిత్ర

ఎయు కెవి.గోపాలకృష్ణ ఎంపీ థియేటర్‌కు విశిష్టమైన చరిత్ర ఉంది. ఈ థియేటర్ ఏర్పాటు కావడానికి ఎయులో 1942 నుంచి 1963 వరకు సుమారు రెండు దశాబ్దాల పాటు రిజిస్టర్‌గా డాక్టర్ కెవి.గోపాలకృష్ణ విశేష కృషి చేశారు. ఆయన స్వతహాగా నటుడు, దర్శకుడు, రచయిత కూడా. ఈ నేపథ్యంలో ఆయన ఎయులో రంగస్థల ప్రదర్శనలకు పునాది వేశారు. అందుకోసం ఆయన పేరు మీదనే ఆరుబయట రంగస్థలం నిర్మించారు. ఆయన దర్శకత్వంలో అనేక నాటక ప్రదర్శనలు జరిగాయి. ఎయులో చదువుకున్న విద్యార్థులే ఈ ప్రదర్శనలు ఇచ్చేవారు. ఆ తర్వాత ఆయన బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీకి ఆయన చైర్మన్‌గా కూడా వ్యవహరించారు. కలలకు దోహదపడిన అనేకమంది సినీ నాటక ప్రముఖులను ఇదే వేదికపై సత్కరించి కళా ప్రపూర్ణ బిరుదులు ప్రదానం చేశారు. కీర్తిశేషులు అక్కినేని నాగేశ్వరరావు, ఎన్‌టి.రామారావు, ఎస్‌వి. రంగారావు వంటి వారు ఇదే వేదికపై ఎయుచే కళా ప్రపూర్ణ అవార్డులు స్వీకరించారు. ఎయులో చదువుకొని ఈ వేదికపై కళా ప్రదర్శనలు ఇచ్చిన అనేకమంది ఇటు నాటక రంగంలోనూ, అటు సినీ రంగంలోనూ రాణించారు. అయితే ఈ వేదికపై ఎయు విద్యార్థుల ప్రదర్శనలు మినహా ప్రైవేటు సంస్థల వారు ప్రదర్శనలు ఇచ్చే అవకాశం లేకపోవడం కూడా ఇంత చక్కటి వేదిక పూర్తిస్థాయిలో వినియోగంలోకి రావడం లేదని చెప్పవచ్చు. అద్దె ప్రాతిపదికన ప్రైవేటు నాటక సమాజాల వారికి కూడా ఇక్కడ ప్రదర్శనలు ఇచ్చే అవకాశం కల్పిస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

'కాంట్రాక్టు విషయంలో న్యాయం చేయాలి'

ప్రజాశక్తి - ములగాడ

ఐఎంయువి విద్యార్థులకు క్యాటరింగ్ సేవలను అందించే కాంట్రాక్టు విషయంలో తమకు అన్యాయం జరిగిందని, కారకులపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని సతీష్ ట్రేడర్స్ ప్రొప్రైటర్ జివిఎన్.శేషు కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం మీడియాకు ఓ ప్రకటన విడుదల చేశారు. 28 సంవత్సరాలుగా నేవీలో మ్యాన్ పవర్ సప్లయర్‌గా తాము కాంట్రాక్ట్ పనులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. నౌకాదళ సంస్థలకు, ఇతర కేంద్ర ప్రభుత్వ సంస్థలకు క్యాటరింగ్ పనులు చేసి పెడుతున్నామని అన్నారు. ఈ క్రమంలోనే 1 ఆగస్ట్ 23 నుంచి 1 ఆగస్ట్ 2024 వరకు ఐఎంయువి విద్యార్థులకు క్యాటరింగ్ సేవలను అందించడం కోసం తాము గత ఏడాది మార్చి 16న టెండరు ప్రక్రియలో కూడా పాల్గొన్నామన్నారు. తమకే ఆ టెండర్ దక్కిందని తెలిపారు. అయితే అప్పుడు జరిగిన ఒప్పందానికి తూట్లు పొడుస్తూ క్యాంపస్ డైరెక్టర్ వ్యవహరించారని పేర్కొన్నారు. తమను అసమర్థ కాంటాక్టర్‌గా పేర్కొన్నారని చెప్పారు. ఒఎన్ఎం, హెచ్ఒడి ప్రొఫెసర్ భాను ప్రకాష్ ఎటువంటి అదనపు ఛార్జీలూ లేకుండా కొన్ని ప్రత్యేక వంటకాలు వండాలని తమను కోరగా తాము పరిస్థితులరీత్యా అంగీకరించలేదని తెలిపారు.

ఈ క్రమంలో తమపై కక్ష సాధింపు చర్యలు పెరిగాయని పేర్కొన్నారు. తప్పుడు ఆరోపణలు చేసి ముందస్తు నోటీసు, సరైన కారణం లేకుండా బిల్లులను విడుదల చేయకుండా ఒప్పందాన్ని క్యాంపస్ డైరెక్టర్ విడిచిపెట్టారని తెలిపారు. ఆ తరువాత న్యాయపరంగానూ తాము ముందుకెళ్లామన్నారు. కొన్ని రోజుల తర్వాత వారు అసలు కాంట్రాక్ట్ నీతిని ఉల్లంఘిస్తూ నిర్ణయాలు తీసుకున్నారన్నారు. ఈ నేపథ్యంలో తమకు న్యాయం చేయాలని కోరారు.

ప్రజా సంక్షేమంపై దృష్టి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : టిడిపి కూటమి ప్రభుత్వ హయాంలో కక్ష సాధింపు చర్యలు ఉండవని, ప్రజా సంక్షేమంపైనే ప్రధాన దృష్టి ఉంటుందని తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి ఈతలపాక సుజాత, జిల్లా ప్రధాన కార్యదర్శి గణగళ్ల సత్య, కేదార లక్ష్మి, తోట శ్రీదేవి అన్నారు. చంద్రబాబుకూ, జగన్‌కూ మధ్య ఉన్న తేడా ప్రజలకు అర్థమవుతోందని తెలిపారు. ఆదివారం సాయంత్రం టిడిపి జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బాపట్ల జిల్లాలో ఒక బాధితురాలు అత్యాచారానికి, హత్యకు గురవడం దురదృష్టకరమన్నారు. సంఘటన జరిగిన వెంటనే సిఎం చంద్రబాబు స్పందించి హోం మంత్రి అనితకు ఆదేశాలు ఇవ్వడంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రభుత్వం తరుపున రూ.10 లక్షలు అందించారన్నారు. గత ప్రభుత్వంలో ఇటువంటి ఘటనలు జరిగినప్పుడు అప్పటి వైసిపి ప్రభుత్వం ఇలా స్పందించిన దాఖలాలులేవన్నారు. రాష్ట్రంలో ఉన్న తమది ప్రజా ప్రభుత్వమని అన్నారు. ప్రతి జిల్లాలో వైసిపి కార్యాలయాలను అక్రమంగా నిర్మించారని తెలిపారు.

విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు సభ్యులకు

12 శాతం డివిడెంట్ చెల్లింపు



మాట్లాడుతున్న రాఘవేంద్రరావు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు సభ్యులకు 12 శాతం డివిడెంట్ చెల్లిస్తామని బ్యాంకు చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు ప్రకటించారు. ఆదివారం మద్దిలపాలెం సమీపంలో కాకతీయ కల్చరల్ అసోసియేషన్ హాల్‌లో జరిగిన బ్యాంకు 109వ వార్షిక మహాజన సభలో ఆయన ఈ ప్రకటన చేశారు. డివిడెంట్ 12 శాతం చొప్పున రూ.38 కోట్లు 79 లక్షల రూపాయలు చెల్లించనున్నట్లు తెలిపారు. బ్యాంకు డైరెక్టర్ మానం ఆంజనేయులు ప్రసంగిస్తూ పేదలు, సామాన్య ప్రజల జీవన ప్రమాణాలు పెరిగే విధంగా రుణాలు మరింతగా అందజేసే విధంగా బ్యాంకు ఆలోచన చేయాలన్నారు. బ్యాంకు అభివృద్ధికి సుదీర్ఘ సేవలు అందించిన ఆంజనేయులు రాజీనామాను ఈ సభలో ఆమోదించారు. బ్యాంకు డైరెక్టర్ జెవి.సత్యనారాయణమూర్తి ప్రవేశపెట్టిన సంప్రదింపుల కమిటీల ఎన్నికపై తీర్మానాన్ని ఆమోదించారు. సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ బ్యాంకు బైలా నిబంధనలలోని 37 (ఎ)లో నియమాల ప్రకారం బ్రాంచిల సర్వసభ్య సమావేశాలలో సంప్రదింపుల కమిటీ ఎన్నిక జరుపుకుంటున్నామని తెలిపారు. సభ్యులకు, మేనేజర్లకు మధ్య వారధిలా సంప్రదింపుల కమిటీలు పనిచేస్తాయన్నారు. బ్యాంకు డైరెక్టర్ సి.కృష్ణమోహన్‌రావు అనుబంధ సంస్థ ఏర్పాటుపై ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సమావేశంలో ఆమోదించారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్‌రావు మాట్లాడుతూ అనుబంధ సంస్థను ఏర్పాటు చేయడం ద్వారా సంక్షేమ పథకాలన్నింటినీ ఆ సంస్థ ద్వారా నిర్వహించే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో చార్టెర్డ్ అకౌంటెంట్, డైరెక్టర్ వి.చంద్రశేఖర్, సీనియర్ వైస్ చైర్మన్ గుడివాడ భాస్కరరావు, డైరెక్టర్లు ఎస్.నాగభూషణ చౌదరి, ఎజె.స్టాలిన్, ఎన్.కామరాజు, కె.భవాని, జి.జనార్ధనరావు, సిహెచ్.ఆదినారాయణ శాస్త్రి, ఎస్.జానకి రామచంద్రరాజు, వెంకట రమణారావు, కె.ప్రసాదరావు, పార్వతీదేవి, కోటేశ్వరరావు, నారాయణస్వామి, రామకృష్ణారావు, బాబూరావు, సిఇఒ పివి.నరసింహమూర్తి పాల్గొన్నారు.

ఎసిఎ జట్లకు ప్రధాన కోచ్‌ల నియామకం

ప్రజాశక్తి -పిఎం పాలెం : క్రికెట్ అడ్వైజరీ కమిటీ (సిఎసి) 2024-25 సీజన్ కోసం పురుషులు, మహిళల ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఎసిఎ) జట్లలోని పలు విభాగాలకు ప్రధాన కోచ్‌లను నియమించారు. 71 ఏళ్ల ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ చరిత్రలో గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఇంటర్నేషనల్‌కు ఆడిన కేరళ రాష్ట్రానికి చెందిన భారతీయ మాజీ క్రికెటర్ టిను యోహానన్‌ను సీనియర్ పురుషుల విభాగానికి ప్రధాన కోచ్‌గా నియమించారు. అండర్-23 పురుషుల విభాగానికి ప్రధాన కోచ్‌గా జె.కృష్ణారావు, సీనియర్ మహిళా విభాగానికి ఎంఎన్.విక్రమ్‌వర్మ, అండర్-23 మహిళా విభాగానికి ఎస్.రమాదేవి, అండర్-19 మహిళా విభాగానికి ఎస్.శ్రీనివాసరెడ్డి, అండర్-15 మహిళా విభాగానికి ఎం.సవితను ప్రధాన కోచ్‌లుగా నియమించారు. ఇంటర్నేషనల్‌కు ఆడిన యోహానన్‌ను ప్రధాన కోచ్‌గా తీసుకొచ్చేందుకు ఎసిఎ అధ్యక్షులు పి.శరత్ చంద్రారెడ్డి, కార్యదర్శి ఎస్ఆర్.గోపినాథ్‌రెడ్డి తీవ్రంగా కృషి చేసినందుకు సిఎసి చైర్మన్ ఎన్.మధుకర్ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

యోహానన్ గురించి..

యోహానన్ 1979 ఫిబ్రవరి 18న జన్మించారు. భారతీయ మాజీ క్రికెటర్. అతను కుడిచేతి వాటం కలిగిన ఫాస్ట్ మీడియం బౌలర్. కేరళ తరపున ఫస్ట్‌క్లాస్ క్రికెట్ ఆడాడు. భారతదేశం తరపున టెస్ట్, వన్డే క్రికెట్ ఆడిన మొదటి కేరళ ఆటగాడు. అతను ప్రస్తుత కేరళ క్రికెట్ జట్టు కోచ్. 2000లో బెంగుళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీకి మొదటి ఇన్‌టేక్ కోసం ఎంపికయ్యాడు. అతను డిసెంబర్ 2001లో ఇంగ్లండ్‌తో జరిగిన స్వదేశీ సిరీస్‌లో టెస్టు అరంగేట్రం చేశాడు. మొహాలీలో జరిగిన మొదటి టెస్టులో అతను ఇంగ్లాండ్ ఓపెనర్లిద్దరినీ అవుట్ చేశాడు. అతను తన మొదటి ఓవర్ నాల్గవ బంతికి తన మొదటి టెస్ట్ వికెట్ సాధించారు. 2024-25 సీజన్‌ను విజయవంతంగా నిర్వహించాలని ఎసిఎ అధ్యక్షులు పి.శరత్ చంద్రారెడ్డి, కార్యదర్శి ఎస్.ఆర్.గోపినాథ్‌రెడ్డి కోరారు.



కోచ్‌గా నియమితులైన మాజీ క్రికెటర్ టిను యోహానన్

నేటి నుంచి ట్రస్టు వేడుకలు

ప్రజాశక్తి -పిఎం పాలెం : జివిఎంసి 6వ వార్డు పరిధి శ్రీవల్లీనగర్ సమీపంలో ఉన్న హజరత్ ముఖ్తియర్ అలీ చారిటబుల్ ట్రస్టు 22వ వార్షికోత్సవాన్ని సోమ, మంగళవారాల్లో నిర్వహించనున్నట్లు ట్రస్టు చైర్మన్ డాక్టర్ ఎమ్‌డి అహ్మద్ తెలిపారు. ఆదివారం ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ట్రస్టు సమీపంలో ఈ వేడుకలు నిర్వహించనున్నామని తెలిపారు. మంగళవారం ట్రస్టులో పేదలకు భోజనం పంపిణీ ఉంటుందని పేర్కొన్నారు. గత విద్యా సంవత్సరంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు, వివిధ రంగాలలో ఉత్తమ కళాకారులను ప్రత్యేకంగా సన్మానించి బహుమతులు అందజేస్తామని చెప్పారు. ట్రస్టు వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన వాలీబాల్, బాస్కెట్ బాల్ తదితర క్రీడల్లో విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. ముఖ్య అతిథిగా భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసురావు హాజరవుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు వైస్ చైర్మన్ భాషా, సెక్రటరీ సుధీర్, ట్రెజరర్ ఖాదర్, ట్రస్టు సభ్యులు తాజ్, జలల్ భాషా, సంతోష్, సుభాహని, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయంగా కాలువ

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం పంచాయతీ ఎస్సీ, బీసీ కాలనీల నుంచి పోయే మురుగునీరు కాలువ ప్రమాదాలకు నిలయంగా మారింది. కాలనీ నుంచి మురుగు నీరు పోవడానికి గతంలో కాలువ ఏర్పాటు చేసి బిపి కల్లాలకు వెళ్లే గెడ్డకు కలిపారు. ప్రస్తుతం కల్వర్టు పూడుకుపోయి పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. కల్వర్టు వద్ద మురుగు కూపంగా మారింది. ఆనందపురం -బోని రోడ్డులో సాయిబాబా గుడి బిపి కల్లాలు రోడ్డు మలుపు వద్ద మురుగు కాలువ పక్కన ఎటువంటి రక్షణ గోడ లేకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గతంలో ఈ కల్వర్టు పక్కన గోడ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అధి శిథిలమైపోయింది. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి మురుగు కాలువకు మరమ్మత్తులు చేపట్టి రోడ్డుకు సమీపంలో ఉన్న ఈ కల్వర్టకు గోడ ఏర్పాటుచేయాలని వాహనదారులు, గ్రామస్తులు కోరుతున్నారు.

జగన్నాథ వార్షిక స్నానం

ప్రజాశక్తి -మధురవాడ : జగన్నాథునికి ఏడాదికొక్కరోజు జ్యేష్ఠ పూర్ణిమనాడు నిర్వహించే అభిషేకం ఆదివారం సాగర్‌నగర్‌లో ఇస్కాన్ ఆధ్వర్యాన వైభవంగా నిర్వహించారు. స్నానవేదికపై ముగ్గురు దేవతలతో పాటు సుదర్శనుణ్ణి ప్రతిష్టించారు. అనంతరం జగన్నాథునికి 35 కలశాలు, బలరాముడికి 33 కలశాలు, సుభద్రకు 22 కలశాలు, సుదర్శనుడికి 18 కలశాలతో అభిషేకం చేశారు. జగన్నాథుడు స్నానపూర్ణిమ రోజున మాత్రం గణనాథుడిగా దర్శనమిస్తాడు. అర్చకులు జగన్నాథ, బలభద్రులను గజముఖాలతో అలంకరించారు.

మురుగుపోయే మార్గం చూపరూ..



కాలువలో నిల్వ చేరిన మురుగు నీరు

ప్రజాశక్తి -మధురవాడ : మురుగు పోయేందుకు సరైన మార్గం చూపండి మహా ప్రభో అంటూ మొగదారమ్మ కాలనీ వాసులు వేడుకుంటున్నారు. జివిఎంసి 7వ వార్డు పరిధిలోని మొగదారమ్మ కాలనీ నుంచి ఆర్‌టిసి కాలనీకి వెళ్లు ప్రధాన రహదారికి ఇరువైపులా జివిఎంసి కాలువలు నిర్మించింది. మురుగు నీరు పోయే అవుట్‌లెట్ మార్గం సక్రమంగా లేదు. దీంతో అక్కడ ఉన్న బహులు అంతస్థుల నుంచి వచ్చే నీటితో మురుగు కాలువులు నిండిపోయాయి. దాని నుంచి తీవ్ర దుర్గంధం వెదజల్లడంతో పాటు ఈగలు, దోమలు వృద్ధి చెందుతున్నాయి. స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మురుగు పోయే అవుట్ లెట్‌తో పాటు డ్రెయినేజీ వ్యవస్థను మెరుగు పరచాలని పలువురు కోరుతున్నారు.

'ఎస్ఒఎస్ సేవలు ప్రశంసనీయం'

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ఎస్ఒఎస్ చిల్డ్రన్స్ విలేజ్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని పలువురు వక్తలు ఉద్ఘాటించారు. ఎస్ఒఎస్ చిల్డ్రన్స్ విలేజ్ వ్యవస్థాపకులు డాక్టర్ హెర్మన్ మైనర్ జయంతి సందర్భంగా స్థానిక ఎస్ఒఎస్ చిల్డ్రన్స్ విలేజ్‌లో ఆదివారం 60వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డాక్టర్ హెర్మన్ మైనర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.జయదేవి హాజరై మాట్లాడారు. సమాజ ఉన్నతిలో తల్లి పాత్ర బహుముఖమైనదన్నారు. ఇక్కడున్న పిల్లలు తల్లుల ప్రేమ, అనురాగం పొందడమే గాకుండా జీవితంలో ఉన్నతులుగా ఎదుగుతుండడం గర్వంగా ఉందన్నారు.

ప్రత్యేక అతిథిగా హాజరైన జిల్లా ప్రోహిబిషన్, జువైనల్ సంక్షేమ శాఖ అధికారి ఎం.శరత్‌బాబు మాట్లాడుతూ, నిబద్ధత గల ఉద్యోగులు, సిబ్బంది అందిస్తున్న సేవలను కొనియాడారు. రాష్ట్రంలో ఎన్నో స్వచ్ఛంద సంస్థలు ఉన్నప్పటికీ వాటన్నింటికీ భిన్నమైనది ఎస్ఒఎస్ అన్నారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ ఎంఆర్ఎల్ రాధ మాట్లాడుతూ, ఇక్కడి పిల్లలు ఉన్నతోద్యోగాల్లో స్థిరపడాలని ఆకాక్షించారు. చిల్డ్రన్స్ విలేజ్ ఇంఛార్జి సి.మణికంఠన్, కుటుంబ బలోపేత కార్యక్రమం ఇంఛార్జి కె.దుర్గరాజు, సిబ్బంది ఆర్.కృష్ణవేణి, జాన్ పీటర్, ఆర్ఎస్ నాయక్, సంజయ్. తల్లులు, 250 మంది పిల్లలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టెన్త్, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు చేతి గడియారాలు, ట్రావెలింగ్ బ్యాగ్‌లను బహూకరించారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



వార్షికోత్సవంలో కేక్ కట్ చేస్తున్న జయదేవి

జమ్మి చెరువు పార్కులో మొక్కల నాటివేత



పార్కులో మొక్కలు నాటుతున్న ట్రస్ట్ కార్యకర్తలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక జమ్మి చెరువు పార్కు, వార్డు సచివాలయం ఆవరణలో పిఠాపురం ఉమర్ అలీ షా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఆదివారం పలు మొక్కలు నాటారు. నాటిన 60 మొక్కల్లో రెండేళ్ల వయసు గల పండ్ల మొక్కలు, నీడను ఇచ్చేవి మరికొన్ని ఉన్నాయి. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి గుడ్డ సంచుల ప్రాధాన్యతను తెలుపుతూ పార్కుకు వచ్చిన సందర్శకులకు అవగాహన కల్పించారు. గుడ్డ సంచులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉమర్ అలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ కన్వీనర్ డాక్టర్ ఆనందకుమార్ పింగళి మాట్లాడుతూ, ప్రతి మొక్క ఒక ఆక్సిజన్ సిలెండర్ వంటిదని, 'నా మొక్క, నా శ్వాస' నినాదంతో తమ ట్రస్ట్ ద్వారా పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నామని తెలిపారు. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఉమర్ అలీ షా పిలుపు మేరకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో విరివిగా మొక్కలు నాటే కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణ కోరుతూ అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు కార్యకర్తలు పి.మంజుల, పివి.రామరెడ్డి, ఎన్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

172 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని నేరాలవలస పంచాయతీ పరిధి చిన్నపురం జంక్షన్ పప్పుల మిల్లు వద్ద శనివారం సాయంత్రం అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం... అందిన సమాచారం మేరకు పద్మనాభం పోలీసులు, సిటీ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది కలిసి వాహన తనిఖీలు చేపట్టారు. కారులో వెళ్తున్న నలుగురు పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిని పోలీసులు పట్టుకొని విచారించారు. వారి వద్ద 172 కిలోల గంజాయి లభ్యమైంది. తునికి చెందిన బొండలపు అప్పారావు, బొదల సురేష్, చింతమనేని రాజా, అరకుకు చెందిన మజ్జి రమేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 172 కిలోల గంజాయిని, కారును, ఐదు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

జూదరుల అరెస్టు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం వేములవలస శివారు ప్రాంతంలో బహిరంగంగా పేకాట ఆడుతున్న 9 మందిపై కేసు నమోదు చేసినట్లు ఆనందపురం సిఐ తిరుపతిరావు తెలిపారు. పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు దాడులు చేసినట్లు తెలిపారు. వారి నుంచి 52 పేక ముక్కలు, రూ.10,030 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వారిపై కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఎస్ఐలు సంతోష్, శివ, రైటర్ గాంధీ, సిబ్బంది పాల్గొన్నారు.

కోడిపందేలపై దాడులు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం దుక్కవానిపాలెం శివారు ప్రాంతంలో కోడి పందేలు ఆడుతున్న వారిపై పోలీసులు దాడులు చేశారు. ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఆరు బైకులు, రెండు కోడి పుంజులు, రూ.10,100 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సిఐ టివి.తిరుపతిరావు తెలిపారు. ఎస్ఐలు సంతోష్, శివ, రైటర్ గాంధీ, సిబ్బంది పాల్గొన్నారు.

బొగ్గు రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి- పరవాడ: మండలంలోని దేశపాత్రునిపాలెం నుంచి ఎన్‌టిపిసి సింహాద్రికి వెళ్లే రైల్వే మార్గంలో పిట్టవానిపాలెం వద్ద గూడ్స్ రైలు ఢీకొనడంతో సుమారు 50ఏళ్ల వయస్సున్న గుర్తుతెలియని వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. ఆదివారం ఉదయం సుమారు 6 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తి రైల్వే ట్రాక్‌పై వెళుతుండగా వెనుక నుంచి రైలు గుద్దడంతో రైల్వే ట్రాక్ పక్కన్న రెండు కాళ్ళు, రెండు చేతులు తెగిపడి మృతి చెందాడు. ట్రాక్‌ను పర్యవేక్షిస్తున్న సూపర్‌వైజర్ ఎన్. వెంకటనాయుడు గమనించి, రైల్వే ఉన్నతాధికారులతోపాటు, కలపాక విఆర్ఒకు సమాచారమిచ్చారు. పిట్టవానిపాలెం, కలపాక గ్రామాల్లో దీనిపై విచారించగా, ఆయా గ్రామాల్లో భిక్షాటన చేసి జీవనం సాగిస్తున్న వ్యక్తిగా గుర్తించారు. సమాచారం అందుకున్న పరవాడ ఎస్ఐ టి మల్లేశ్వరరావు , సిబ్బందితో సంఘటనాస్థలికి చేరుకుని మృతిపై ఆరా తీశారు. కలపాక విఆర్ఒ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లేశ్వరరావు తెలిపారు.

విద్వేషపూరిత ప్రసంగాల పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి-సీతమ్మధార : విద్వేషపూరిత ప్రసంగాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఫౌండేషన్ పర్ పీస్ అండ్ హార్మోనీ చైర్మన్ నరవ ప్రకాశరావు పిలుపునిచ్చారు. ఫౌండేషన్ పర్ పీస్ అండ్ హార్మోనీ, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడమ్ సంయుక్త ఆధ్వర్యాన ఆదివారం డాక్టర్ ఎల్‌బి కాలేజీ ప్రాంగణంలోని గాంధీ సెంటర్‌లో అంతర్జాతీయ ద్వేష పూరిత ప్రసంగాల వ్యతిరేక దినాన్ని పాటిస్తూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశరావు మాట్లాడుతూ, కొంతమంది మత పెద్దలు, రాజకీయ నాయకులు తమ స్వార్థం కోసం ప్రజలలో అల్లరులు సృష్టించడానికి ప్రసంగాలు చేస్తారని, వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. దీని పట్ల యువతను జాగృతం చేయాలన్నారు. ఎయు మాజీ రిజిస్ట్రార్ వెలగపూడి ఉమమేహశ్వరరావు, ఎయు మాజీ ఆచార్యులు కె.రవి, జి.పద్దయ్య, డాక్టర్ డివి.సూర్యారావు, బ్రహ్మకుమారి రమ మాట్లాడుతూ, ఇటీవల ద్వేష ప్రసంగాలు పెరుగుతున్నాయన్నారు. శాంతికి, జాతీయ సమైఖ్యతకు భంగం కలిగిస్తున్న ప్రసంగాలను విద్యాదికులు ఖండించాలని కోరారు. అందరూ కలిసి శాంతి ప్రతిజ్ఞ చేశారు. గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ మున్నారు, హుస్సేన్, చాట్ల బాబూరావు రెడ్డి, డాక్టర్ కె.సత్యమూర్తి, డాక్టర్ గౌరీశంకర్, డాక్టర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా శ్రీనగర్ రైతుబజార్

పార్కింగ్ యార్డుగా మారిన వైనం

ప్రజాశక్తి -గాజువాక : శ్రీనగర్‌లో ఏర్పాటుచేసిన రైతు బజారును వినియోగంలోకి తేకపోవడంతో ప్రస్తుతం పార్కింగ్ యార్డ్‌లా మారింది. శ్రీనగర్‌తో పాటు, సుందరయ్య కాలనీ, ఆఫీసియల్ కాలనీ, దుర్గానగర్, కొత్త దిబ్బపాలెం, కర్ణవానిపాలెం తదితర ప్రాంత ప్రజలకు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న గాజువాక రైతుబజార్‌కు వెళ్లాలంటే కష్టమని, ఈ ప్రాంత ప్రజల కోసం శ్రీనగర్‌లో ఏడేళ్ల క్రితం రూ.20 లక్షల వ్యయంతో 15 స్టాల్స్‌తో రైతు బజార్ నిర్మాణం చేపట్టారు. దీనికి సంబంధించిన పనులు దాదాపు పూర్తయ్యాయి. ఈ స్థలానికి సంబంధించి కొంతమంది కోర్టుకు వెళ్లడంతో పెండింగ్‌లో పడింది. స్థల సమస్య పరిష్కారానికి రెవెన్యూ, జివిఎంసి అధికారులు చొరవ చూపకపోవడంతో ప్రస్తుతం రైతు బజార్ నిరుపయోగమైంది. దీంతో ఈ స్థలంలో చుట్టు పక్కల ఉన్న వారు కార్ల పార్కింగ్‌గా ఉపయోగిస్తున్నారు. మరి కొంతమంది వారి పాత సామానులను భద్రపరచుకుంటున్నారు. రాత్రి సమయంలో మందుబాబులకు ఈ రైతు బజార్ ఒక అడ్డాగా మారింది. రైతుబజార్‌లో మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. దీన్ని వినియోగంలోకి తెస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటారని స్థానికులు భావిస్తున్నారు. ఈ ప్రాంతంలో నివసిస్తున్న వారిలో ఎక్కువమంది రోజు వారి వేతనం సంపాదించుకునేవారుగా ఉన్నారు. శ్రీనగర్‌లో గతం కంటే ఇప్పుడు జనాభా, ఇళ్ల సంఖ్య కూడా పెరిగాయి. గాజువాక రైతు బజార్‌లో పార్కింగ్ సమస్య ఉంది. వీలైనంత తొందరలో శ్రీనగర్‌లో ఏర్పాటుచేసిన రైతు బజార్‌ను వినియోగంలో తేవాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై జోనల్ కమిషనర్ సన్యాసినాయుడును వివరణ కోరగా పరిశీలిస్తామని చెప్పారు.



నిరుపయోగంగా ఉన్న శ్రీనగర్ రైతు బజార్‌లో స్థానికులు కార్లు పార్కింగ్ చేస్తున్న దృశ్యం

కూన రవికి ఘన స్వాగతం

ప్రజాశక్తి-మాధవధార : ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవి కుమార్ శాసనసభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసి మొదటి సారిగా ఆదివారం విశాఖ పట్నం ఎయిర్‌పోర్టుకు వచ్చిన సందర్భంగా 50వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సనపల వరప్రసాద్ ఆధ్వర్యాన ఘన స్వాగతం పలికారు. వార్డు తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుంచి పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చుకొని పార్టీ శ్రేణులు, మహిళ నేతలతో కలిసి ర్యాలీగా వెళ్లి కూన రవికుమార్‌కు గజమాలతో సాదర స్వాగతం పలికారు. బిర్లా జంక్షన్‌లోని అంబేద్కర్ విగ్రహానికి, కీర్తిశేషులు నందమూరి తారకరామారావు విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కూన రవికుమార్ మాట్లాడుతూ, సైకో పాలనను అంతమొందించిన రాష్ట్ర ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. ఆమదాలవలసలో తన గెలుపునకు సనపల వరప్రసాద్ కృషిచేశారని తెలిపారు. వరప్రసాద్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలు కూటమి ప్రభుత్వానికి ఎనలేని ఆదరణ అందించారన్నారు చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు పెడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



కూన రవికుమార్‌కు గజమాలతో స్వాగతం పలుకుతున్న ప్రసాద్

ఆకట్టుకున్న ఘంటసాల ఆరాధనోత్సవాలు

ప్రజాశక్తి-సీతమ్మధార: పాత పాటల మధురిమలతో నగరంలోని పౌర గ్రంథాలయంలో ఆదివారం జరిగిన ఘంటసాల ఆరాధనోత్సవాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ప్రముఖ వైద్యులు సయ్యద్ రహమతుల్లా నిర్వహణలో జరిగిన ఈ ఆరాధనోత్సవంలో ఘంటసాల పాత పాటలను గాయనీ గాయకులు ఆలపించారు. సీనియర్ సిటిజన్స్ పాత పాటల పేరడీతో రెండు గ్రూపులుగా కబడ్డీ ఆట తరహాలో పాటలకు లయబద్ధంగా ఆడుతూ పాడారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్స్ నటించిన లఘు నాటికలు ప్రేక్షకులను ఆలోచింపచేసాయి. 'గానలహరి' పేరుతో గాయనీ గాయకులు డాక్టర్ కె.రామ్మూర్తి, ఎమ్మెస్ సుబ్బారావు, నానాజీ, కె.రాజేంద్రప్రసాద్, బెహరా మురళి, బి.కల్యాణి, ఎన్.రేణుక ఆలపించిన ఘంటసాల పాత పాటలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. వ్యాఖ్యాతగా మస్తాన్‌రెడ్డి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆత్మీయ అతిథులుగా డాక్టర్ జి.మహేష్, డాక్టర్ జివి.రావు, గిన్నిస్ బుక్ రికార్డు గ్రహీత కె.రంగారావు, లఘు నాటికల నిర్వాహకులు సిహెచ్ నందగోపాల్, తదితరులు హాజరయ్యారు.

విద్యుత్ మంత్రిని కలిసిన బిసి ఉద్యోగులు

ప్రజాశక్తి-సీతమ్మధార : ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవిని విద్యుత్ బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం నేతలు కలిశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు పోలాకి శ్రీనివాసరావు ఆధ్వర్యాన మంత్రిని కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా పోలాకి శ్రీనివాసరావు మాట్లాడుతూ, విద్యుత్ శాఖ ఉద్యోగులు రాష్ట్రానికి వెన్నెముక అని, బీసీ ఉద్యోగుల సమస్యలపై చర్చించేందుకు పది రోజుల్లో కలుద్దామని మంత్రి చెప్పారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం డిప్యూటీ జనరల్ సెక్రటరీ కోసెట్టి అప్పారావు, కె.సాయిబాబా, ఎన్.పాపారావు, బి.నరసింహమూర్తి, కేశవ శంకరరావు పాల్గొన్నారు.



మంత్రి రవికుమార్‌కు జ్ఞాపికను అందిస్తున్న పోలాకి శ్రీనివాసరావు



కరపత్రాలను విడుదలచేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రభుత్వ బడిని రక్షించుకుందాం : యుటిఎఫ్

ప్రజాశక్తి- కరాస : పిల్లలను చేర్పించడం ద్వారా ప్రభుత్వ బడిని రక్షించుకుందామని యుటిఫ్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి టిఆర్.అంబేద్కర్ పేర్కొన్నారు విశాఖపట్నం జిల్లా యుటిఎఫ్ విస్తృత కార్యవర్గ సమావేశం ఆదివారం యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు దాసరి నాగేశ్వరరావు అధ్యక్షతన హస్మీభవన్‌లో నిర్వహించారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు, యుటిఎఫ్ విశాఖ జిల్లా కమిటీ ముద్రించిన 'ప్రభుత్వ బడిని రక్షించుకుందాం - పాఠశాలలో విద్యార్థులను చేర్పిద్దాం' కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టిఆర్.అంబేద్కర్ మాట్లాడుతూ, నూతన అకడమిక్ సంవత్సరంలో బడి చుట్టూ ఉన్న ప్రాంతాలలో బడి వయసున్న పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విధంగా తల్లిదండ్రులను కలవాలని, ప్రతి ఉపాధ్యాయుడూ తన బాధ్యతను నిర్వర్తించాలని, తద్వారా ప్రభుత్వ బడిని కాపాడాలని యుటిఎఫ్ పిలుపునిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తడాన అప్పారావు, జిల్లా గౌరవాధ్యక్షులు అనకాపల్లి పైడిరాజు, సహాధ్యక్షులు రొంగలి ఉమాదేవి, కోశాధికారి కొత్తపల్లి రాంబాబు, జిల్లా కార్యదర్శులు చుక్క సత్యం, ఉప్పాడ రాము, రిజ్వాన్, రియాజ్, 11 మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

10న కోర్కెల దినాన్ని విజయవంతం చేయాలి

సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్

ప్రజాశక్తి-ఉక్కునగరం : మూడోసారి అధికారంలోకి వచ్చిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అమలు చేయడానికి పూనుకుంటుందని, ఈ విధానాలకు అడ్డుకట్ట వేసేందుకు జులై 10వ తేదీన దేశవ్యాప్తంగా చేపట్టే 'కోర్కెల దినం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్ పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో కుమార్ మాట్లాడుతూ, కేంద్రప్రభుత్వం లేబర్ కోడ్స్ అమలు చేసే ఉత్తర్వులను ఇవ్వడానికి సిద్ధపడుతుందన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వాలు ఏర్పడిన తర్వాత కార్మిక ప్రజా వ్యతిరేక చట్టాలను అమలు చేయడానికి తగిన కార్యాచరణ రూపొందిస్తున్నట్టు తెలిపారు. నాలుగు లేబర్ కోడ్స్‌ను యజమానులకు అనుకూలంగా ఉండటంవల్ల కార్మిక వర్గం తీవ్ర శ్రమదోపిడీకి గురవుతుందన్నారు. తక్షణమే లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, ప్రయివేటీకరణను, జాతీయ నగదు బదిలీకరణ పథకం (నేషనల్ మోనిటైజేషన్ ఆఫ్ పైప్లైన్) లను ఆపాలని, కనీస వేతనాలు నెలకు రూ.26 వేలు చొప్పున నిర్ణయించి అమలు చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కాంట్రాక్టరును తొలగించినా కార్మికులను తొలగించరాదని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ఓల్డ్ పెన్షన్ స్కీమ్‌ను అమలు చేయాలని, నూతన పెన్షన్ స్కీమ్ ను రద్దు చేయాలని, అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్నభోజన కార్మికులను ప్రభుత్వం కార్మికులుగా గుర్తించి కనీస వేతనాలు చెల్లించాలని, పెన్షన్ లాంటి సామాజిక భద్రతా సౌకర్యం కల్పించాలని, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడపాలని, స్టీల్‌ప్లాంట్ రక్షణకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, బిల్డింగు, ఆటో, ముఠా, తోపుడు బళ్ళు, కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని తదితర డిమాండ్లతో జులై 10న కోర్కెల దినం పాటిస్తున్నట్లు చెప్పారు. కార్మిక వర్గం మొత్తం పాల్గొని విజయవంతం చేయాలని, తద్వారా మోడీ ప్రభుత్వానికి హెచ్చరిక జారీచేయాలని పిలుపునిచ్చారు. ఎస్.జ్యోతీశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి పి.మణి, బి.జగన్, ఉపాధ్యక్షులు పి.వెంకటరెడ్డి, శ్రీనివాస్, రామస్వామి, ఎం.సుబ్బారావు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

కరాసలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-వేపగుంట : జివిఎంసి 52వ వార్డు పరిధి పాత కరాసలోని జివిఎంసి ప్రాథమిక పాఠశాలలో మెడి ఓన్ క్లినిక్, ల్యాబ్ ఆధ్వర్యాన ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. డాక్టర్ ఎం.రమేష్‌నాయుడు శిబిరానికి వచ్చిన వారికి వైద్యసేవలందించారు. అవసరమైన మందులను జివిఎంసి డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ చేతుల మీదుగా పంపిణీచేశారు. ప్రజల సౌకర్యార్థం ఉచిత వైద్య శిబిరం నిర్వహించిన మెడి ఓన్ క్లినిక్, ల్యాబ్ ప్రతినిధులను శ్రీధర్ అభినందించారు. అనంతరం శ్రీధర్‌ను వైద్యుల బృందం సత్కరించింది.

చింతగట్లలో ఏరువాక పున్నమి

ప్రజాశక్తి-పెందుర్తి : జెడి ఫౌండేషన్ ఆధ్వర్యాన పెందుర్తి మండలం చింతగట్ల గ్రామంలో రైతు పూజోత్సవం కార్యక్రమంలో భాగంగా సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారాయణ సూచనతో నిర్వహిస్తున్న ఏరువాక పున్నమి కార్యక్రమంలో రైతులను సన్మానించారు. ఈ సందర్భంగా చింతగట్ల సర్పంచ్ భర్త జి.కనకరాజు మాట్లాడుతూ, రైతులకు గిట్టుబాటు ధర విషయంలో ప్రభుత్వం శ్రద్ధచూపాలని కోరారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా రైతులకు న్యాయం జరగడం లేదన్నారు. అనంతరం రైతులను సన్మానించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, జెడి ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

కంచరపాలెం సిఐగా ప్రసాద్

ప్రజాశక్తి-సీతమ్మధార: కంచరపాలెం పోలీస్‌స్టేషన్ శాంతిభద్రతల సిఐగా సిహెచ్ ప్రసాద్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సిఐ ఎస్ భాస్కరరావు సిక్ లీవ్‌లో ఉండడంతో ఆయన స్థానంలో అటాచ్ సిఐగా ప్రసాద్‌ను సిపి రవిశంకర్ అయ్యనార్ నియమించారు. నగరంలోని గాజువాక, మూడు, నాలుగు పట్టణ పోలీస్ స్టేషన్లలో ప్రసాద్ విధులు నిర్వహించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో స్పెషల్ టీంలో ప్రసాద్ పనిచేశారు. ప్రస్తుతం విఆర్‌లో ఉన్న ప్రసాద్ కంచరపాలెం పోలీస్ స్టేషన్ సిఐగా వచ్చారు. బాధ్యతలు తీసుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, శాంతి భద్రతల పరిరక్షణకు, నేరాల నివారణకు సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వహిస్తామన్నారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులు, బాధితుల వైపు నిలబడి న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు.

మౌలిక సమస్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి

● సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

ప్రజాశక్తి- చోడవరం : జిల్లాలో మౌలిక సమస్యలపై కొత్త ప్రభుత్వం దృష్టి సారించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించుకుంటే, ప్రజలను సమీకరించి, వాటిపై పోరాడే శక్తిగా సిపిఎం ఎదగాలని ఆకాంక్షించారు. ఆదివారం సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి వెంకన్న అధ్యక్షతన స్థానిక శ్రీకాంత్ కల్యాణ మండపంలో నిర్వహించిన పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతూ, పేద, బడుగు బలహీన వర్గాలతో పాటు ఉద్యోగ, ఉపాధ్యాయ, స్కీం వర్కర్లు, అసంఘటితరంగ కార్మికులు దళితులు, గిరిజనులు, ఉపాధి కూలీలు ఇలా అన్నివర్గాల ప్రజలు ఎంతో ఆశతో ఓట్లు వేసి కూటమి ప్రభుత్వాన్ని గెలిపించారని, నమ్మి ఓట్లేసిన ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. జిల్లాలో ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించటంతో పాటు వాటి పరిష్కారానికి ప్రజలు వెన్నంటే ఉండాలని సిపిఎం శ్రేణులను పిలుపునిచ్చారు.

ఎపిడిమిక్ సీజన్ ప్రారంభమైనందున అవసరమైన మందులతో వైద్య సిబ్బందిని సిద్ధం చేయాలని, గోవాడ సుగర్ ఫ్యాక్టరీ బకాయిలు వెంటనే చెల్లించి, ఫ్యాక్టరీ ఆధునీకీకరణకు కృషి చేయాలని, రైతులకు సకాలంలో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని, అధిక ధరలను నియంత్రించాలని, ప్రభుత్వాసుపత్రులు, హాస్టళ్లలో సౌకర్యాలను మెరుగుపరచాలని, జిల్లాలో పెండింగ్‌లోఉన్న ఉపాధిహామీ బిల్లు బకాయిలను వెంటనే చెల్లించాలని, నిలిచిన పోయిన గృహాలకు బిల్లులు చెల్లించి, పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. జిల్లాలోని రైతాంగం సాగునీటి సమస్యలపై కొత్త ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు వివి శ్రీనివాసరావు, ఆర్ శంకరరావు, ఎస్‌వి నాయుడు, నాగిరెడ్డి సత్యనారాయణ, ఆర్ దేముడునాయుడు గండి నాయనబాబు ఇ నరసింహమూర్తి 24 మండలాల నేతలు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల నిరసన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి-కశింకోట : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ, కశింకోట మేజర్ పంచాయతీ పారిశుధ్య కార్మికులు నిరసన కొనసాగుతోంది. ఆదివారం సిఐటియు అనుబంధ ఎపి గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో జాతీయ రహదారి నుంచి పంచాయతీ కార్యాలయం మీదుగా సంతబయలు, పెద్ద బజారు వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించడానికి అధికారులు చొరవ చూపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.రామాజీ, జి.వెంకటరమణ, కొండబాబు, ఆదిలక్ష్మి, సత్తిబాబు, ఇతర పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

అంబేద్కర్ గురుకులంలో మిగులు సీట్లు భర్తీకి

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి- సబ్బవరం :మండలంలోని స్థానిక బిఆర్ అంబేద్కర్ గురుకులంలో 6, 7, 8, 9 తరగతులలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈనెల 26లోగా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎన్. రామకృష్ణ తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరానికి 6,7,8,9 తరగతులలో ఎస్‌సి, ఇతర కేటగిరిల్లోని సీట్ల భర్తీకి ఈ నెల 26 సాయంత్రం 5 గంటల లోపు విద్యార్థి ఆధార్, కుల సర్టిఫికెట్‌తో వచ్చి స్థానిక గురుకుల పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలనిసూచించారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 28న సబ్బవరంలోనే ఉదయం 10గంటల నుండి 12 గంటల వరకు పరీక్ష నిర్వహించి, ప్రతిభ చూపిన వారికి ప్రవేశ అవకాశం కల్పిస్తామన్నారు. వివరాల కోసం 8008469493 నెంబర్‌కు ఫోన్ ద్వారా సంప్రదించాలని సూచించారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ రామకృష్ణ సూచించారు.

అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోండి

బాధ్యులైన వైసిపి నేతలపై చర్యలకు సిపిఐ ఎంఎల్ (లిబరేషన్) డిమాండ్

ప్రజాశక్తి-అనకాపల్లి : వైసిపి అధికారంలో ఉన్నప్పుడు అడ్డగోలుగా చేపట్టిన నిర్మాణాలను, స్థలాల ఆక్రమణలపై నోటీసులిచ్చి చర్యలు తీసుకుంటున్న ప్రస్తుత ప్రభుత్వం, కొన్నింటిని చూసి చూడనట్లుగా వదిలేస్తోందని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ నేత పిఎస్ అజయ్ కుమార్ ప్రకటనలో ఆరోపించారు. గాంధీనగరం, మిరియాల కాలనీ పరిధిలో మున్సిపల్ స్థలంలో జరుగుతున్న అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చిన ఆనాడు ప్రతిపక్షంగా ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులు, నేడు మౌనం పాటించడం వెనక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు.

ఇటువంటి అవకాశవాద రాజకీయాలను సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. దాడి వీరభద్రరావు, కొణతాల రామకృష్ణ హయాంలోనే గాంధీనగరం మిర్యాలకాలనీలో మున్సిపల్ ఉద్యోగులకు లోవర్ ఇన్కమ్ గ్రూప్ స్కీం కింద మున్సిపల్ ఉద్యోగులకు క్వార్టర్స్ నిర్మించారు.దీనికి రెండు సెంట్లు స్థలంలో నిర్మించిన మున్సిపల్ క్వార్టర్ నెంబర్ 1, డోర్ నెంబర్ చూపించి 11 సెంట్లు మున్సిపల్ భూమిని రిజిస్ట్రేషన్ పొంది, . గత ప్రభుత్వంలో భవన నిర్మాణానికి అనుమతి పొందారన్నారు. దీనిపై వామపక్ష పార్టీలుగా ఎన్ని ఫిర్యాదులు చేసినా ఆనాటి అధికార పార్టీ నాయకుల ఒత్తిడికి తలొగ్గి, విశాఖపట్నం మున్సిపల్ కమిషనర్, అనకాపల్లి జోనల్ కమిషనర్ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. మిరియాల కాలనీలో మున్సిపాలిటీ స్థలం ఆక్రమణపై ఉన్నతస్థాయి విచారణ కమిటీ వేయాలని, అప్పటివరకు అక్కడ నిర్మాణాలనుఆపాలని అజయ్‌కుమార్ కోరారు.

వికలాంగుల ఆశ్రమానికి వితరణ

రూ.2.50 లక్షల విలువైన సరుకులు అందజేత



వితరణ అందజేస్తున్న శ్రీసఖి సేవాసమితి ప్రతినిధి బిందురాణి

ప్రజాశక్తి -అచ్యుతాపురం : అచ్యుతాపురంలోని వికలాంగుల ఆశ్రమానికి ఆదివారం మురళీనగర్ శ్రీ సఖి సేవాసమితి ప్రతినిధులు రెండున్నర లక్షల రూపాయల విలువచేసే నిత్యావసర సరుకులను, ఇతర వస్తువులను వితరణగా అందించారు. ఆశ్రమ నిర్వాహకులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత పిఎస్‌టి పట్నాయక్‌కు వీటిని అందజేశారు. ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అవసరమయ్యే నోట్ బుక్స్, చాపలు, బకెట్స్, మగ్గులతోపాటు 25 బస్తాల బియ్యం, పది డబ్బాల వంటనూనె, పప్పు దినుసులు కూరగాయలు లాప్‌ట్యాప్, కంప్యూటర్ ఇతర సామగ్రిని వితరణగా అందజేశారు.

ఈ సందర్భంగా దాతలు మురళీనగర్ శ్రీసఖి సేవా సమితి ప్రతినిధి బిందురాణి మాట్లాడుతూ వికలాంగుల ఆశ్రమానికి ప్రతిఒక్కరూ మానవతా దృక్పథంతో సహాయ సహకారాలు అందజేయాలని కోరారు. సూచించారు. అనాధ వికలాంగ బాలల కోసం పాటుపడుతున్న వికలాంగులకైన ఆశ్రమ నిర్వాహకుడు, పట్నాయక్ సేవలు ఆదర్శనీయమని కొనియాడారు.

రాష్ట్రపతి అవార్డు గ్రహీత పట్నాయక్ మాట్లాడుతూ12ఏళ్లగా ఏటా శ్రీసఖి సేవా సమితి ప్రతినిధి బిందురాణి నేతృత్వంలో నోట్‌బుక్స్, ఇతర సామగ్రి అందజేయడంపై కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కె.పావని, ఎన్ స్వర్ణవిశాల, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు

కెపి.అగ్రహారంలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలో కెపి.అగ్రహారం గ్రామంలో ఎంపియుపి స్కూల్ వద్ద చేగువేరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కేపీ అగ్రహారం, కొండపాలెం తదితర గ్రామాల నుంచి యువకులు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానాన్ని చేశారు ఈ సందర్భంగా 50 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు కొండపాలెం, కెపి అగ్రహారం సర్పంచ్‌లు ఎంవిఎస్ నాయుడు, గోపిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసిల ఫోరం అధ్యక్షుడు దేవర అప్పారావు, అడ్డూరు శ్రీను, దేవర భూలీ నాయుడు, సుంకర శ్రీను, తూరుబిల్లి నూకరాజు. అడ్డిపిల్లి గోవిందు, వార్డు సభ్యులు గంగారపు రమణ అప్పారావు. తూర్పుల్లి శ్రీను. తూర్పుల్లి సత్తిబాబు. పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా సేవలు అందిస్తా

● విజయోత్సవ ర్యాలీలో ఎమ్మెల్యే సుందరపు ● ఘన స్వాగతం పలికిన కూటమి శ్రేణులు ● భారీ బైక్ ర్యాలీ



విజయోత్సవ ర్యాలీలో ఎమ్మెల్యే సుందరపు, ఇతర నేతలు

ప్రజాశక్తి - యలమంచిలి / అచ్యుతాపురం/ మునగపాక : రాజకీయ పార్టీలకతీతంగా సేవల అందిస్తానని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ అన్నారు. ఎలమంచిలి ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం అనంతరం ఆదివారం నియోజకవర్గంలో అడుగుపెట్టిన విజయకుమార్‌కు ప్రజలు నీరాజనం పలికారు. ఏటికొప్పాక మొదలుకొని అచ్యుతాపురం వరకు దారి పొడవునా పూలుజల్లి స్వాగతం పలికారు. ముందుగా ఏటికొప్పాక బండిమాంబ అమ్మవారిని దర్శించుకుని విజయోత్సవ ర్యాలీలో నిర్వహించగా, ఊరేగింపు రథంపై ఎమ్మెల్యే విజయకుమార్ తమ్ముడు సతీష్‌కుమార్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి తరలి వచ్చిన అభిమానులు, కార్యకర్తలతో బైక్ ర్యాలీ మొదలైంది. పేట బయ్యవరం మీదుగా ముందు పులపర్తి జంక్షన్, పురుషోత్తపురం, పోతిరెడ్డిపాలెం, లైనకొత్తూరు గ్రామాల మీదుగా యలమంచిలి గాంధీనగరంచేరుకున్నారు. కూటమి సీనియర్ నాయకులు ఆడారి ఆదిమూర్తి, బొద్దపు శ్రీనివాసరావు, ఆడారి రమణబాబు, కొఠారు సాంబ, ఇత్తంశెట్టి సన్యాసిరావు, అన్నం బాబ్జీ, రాజాన నారాయణమ్మ, లవుడు లోవరాజు స్వాగతం పలికారు. దిబ్బపాలెం, పునరావాస కాలనీ, అచ్యుతాపురం జంక్షన్‌లో గజమాలతో సత్కరించారు. పులపర్తి హైవే జంక్షన్ వద్ద టిడిపి మునగపాక మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు, జనసేన అధ్యక్షులు టెక్కలి పరశురాం ఆధ్వర్యంలో ర్యాలీలో జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ ఎలమంచిలి నియోజకవర్గ అభివృద్ధికి ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేస్తానని, ఎటువంటి సమస్య వున్నా నేరుగా తనను సంప్రదించవచ్చన్నారు. తాను కూటమి అభ్యర్థినని, పార్టీల పేరు చెప్పి తన వద్దకు రావద్దన్నారు. కార్యక్రమంలో టిడిపి ఎలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జి ప్రగడ నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్‌కుమార్, జిల్లా పరిషత్ మాజీ ఛైర్‌పర్సన్ లాలం భవానీభాస్కర్, మాజీ జెడ్పిటిసి సభ్యుడు జనపరెడ్డి శ్రీనివాసరావు, జనసేన అచ్యుతాపురం మండల శాఖ అధ్యక్షులు బి రాందాస్, టెక్కలి పరశురాం, అచ్యుతాపురం టిడిపి అధ్యక్షులు జనపరెడ్డి నర్సింగరావు, బిజెపి ఎలమంచిలి నియోజకవర్గ కన్వీనర్ రాజన్న సన్యాసి నాయుడు, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లేకుండానే సమస్య పరిష్కారం!

ప్రజాశక్తి - యలమంచిలి : ఎలమంచిలి ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత తొలిసారిగా యలమంచిలిలో విజయోత్సవ ర్యాలీకి సుందరపు విజయకుమార్ వస్తున్న నేపథ్యంలో పోలీసులు, మున్సిపల్ సిబ్బంది అప్రమత్తమయ్యారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించి, శుభ్రం చేసే పనులు చేపట్టారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న మట్టిదిబ్బల్ని తొలగించారు. పనిలో పనిగా ఈ కొబ్బరిబొండాలమ్మే తోపుడుబండినీ తొలగించారు. ఈ సమస్యలపై పలుమార్లు అధికా ఎవరూ ఫిర్యాదు చెయ్యకుండానే ఆదివారం సమస్యలన్నింటినీ పరిష్కరించడంపై ప్రయాణికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.. రోడ్డుమీద షాపు పెట్టవద్దంటూ వార్నింగ్ ఇవ్వడాన్ని చూసి ముక్కున వేలేసుకున్నారు. ఇదంతా ఒక్కరోజుకే పరిమితం కాకుండా చూడాలని పలువురు అంటున్నారు.

వికలాంగ బాలల 'భవిత'కు భరోసా

- ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు ప్రత్యేకంగా తర్ఫీదు
- ప్రభుత్వపరంగా పలు ప్రోత్సాహకాలు


యలమంచిలిలోని భవిత కేంద్రం


ప్రత్యేక అవసరాల పిల్లలతో నిర్వాహకులు అనురాధ, మూర్తి

ప్రజాశక్తి - యలమంచిలి : ప్రత్యేక అవసరాల పిల్లలకు 'భవిత' కేంద్రాలు ఆసరాగానిలుస్తున్నాయి. చదువుకు దూరంగా ఉన్న వికలాంగులను గుర్తించి సమీపంలోని 'భవిత'కేంద్రాల్లో చేరుస్తున్నారు. ఇంతవరకు జిల్లాలో జరిగిన సర్వేలో ప్రత్యేక అవసరాలున్న పిల్లల్ని 500 మందిని గుర్తించామని జిల్లా కోఆర్డినేటర్ శకుంతల ప్రకటించారు. గుర్తించిన చిన్నారుల్ని భవిత కేంద్రాలకు వెళ్లేలా తల్లిదండ్రులతో సంప్రదిస్తున్నామన్నారు. యలమంచిలి మండలంలో ప్రత్యేక అవసరాలున్న పిల్లలు 30 మందిని గుర్తించినట్లు రైల్వేస్టేషన్ హైస్కూలు భవిత కేంద్రం నిర్వహిస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయులు పిసి హెచ్.వి.ఎన్.మూర్తి, అనురాధ తెలిపారు. ఇక్కడి స్కూల్లో 20 మందిని చేర్చుకొని, అన్ని రకాలు తర్ఫీదులు నేర్పుతున్నట్లు వివరించారు. ప్రభుత్వం గుర్తించిన 21 రకాల సమస్యలున్న వికలాంగులకు వారుంటున్న సమీపంలోని పాఠశాలలో చేర్పిస్తారు. సదరం శిబిరాల్లో వైకల్యశాతం పరిశీలించి అవసరమైన వారికి పరికరాలు అందిస్తారు. వినికిడి, దృష్టి లోపం ఉన్న వారికి ట్యాబ్‌లు అందజేస్తారు. భవిత కేంద్రాల్లో చదువుకుంటున్న వారికి ప్రతి ఏటా రూ. 3,000 రవాణా భత్యం చెల్లిస్తారు. మండలంలో గుర్తించిన వికలాంగులకు మండల కేంద్రంలో ప్రస్తుతం 20 మందికి క్లాసులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వారంలో ఐదు రోజులు పాటు వికలాంగులంతా భవిత సెంటర్లో ఉంటారని, ప్రతి శనివారం వారి సమీపంలోని పాఠశాలలో ఇతర విద్యార్థులతో కలిసి ఉంటారన్నారు.

పాఠశాలకు రాలేని పరిస్థితితో ఉన్న పిల్లలకు వారి ఇంటివద్దకు ఉపాధ్యాయులే వెళ్లి ప్రత్యేక శిక్షణ ఇస్తారు. బాలికలకు ఉపకార వేతనంగా రూ.2వేలు, 9,10 తరగతులు చదివే వారికి సెంట్రల్ స్కాలర్‌షిప్ రూ. 9వేలు నుంచి రూ.11వేలు వరకు అందజేస్తారు. చదువు, ఆటల్లో చురుగ్గా ఉండే వారికి ప్రత్యేక గుర్తింపు ప్రోత్సహం ఉంటుందని వారు మంచి స్థితిలో స్థిరపడే విధంగా ప్రభుత్వం గుర్తింపునిస్తుందని ఆత్మవిశ్వాసం వ్యక్తం చేశారు. ఇటువంటి 'భవిత' కేంద్రాలకు తగిన ప్రచారం కల్పించాల్సిన బాధ్యత అందిరిపై ఉంది. వారికిస్తున్న ప్రోత్సహకాలు, రవాణా, ఉపకార వేతనాలు గురించి వికలాంగ బాలలున్న గ్రామీణ ప్రాంతాల్లోని కుటుంబాలకు తెలియజేయాలని ప్రభుత్వం పలు ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తోంది. వాటన్నింటినీ వికలాంగ విద్యార్థులు అందిపుచ్చుకోవాలని కోరారు.

కేంద్ర విద్యామంత్రి రాజీనామా చేయాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి

ప్రజాశక్తి - పరవాడ: పరీక్షా ప్రశ్నాపత్రాల లీకులతో విద్యావ్యవస్థకు ప్రమాదమని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం మాట్లాడుతూ, నీట్, నెట్ ప్రశ్నాపత్రాల లీకేజీలు, అక్రమాల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖమంత్రిగా కొనసాగే నైతిక అర్హత ధర్మేంద్ర ప్రదాన్ కోల్పోయారని, తక్షణమే నైతిక బాధ్యత వహిస్తూ స్వచ్ఛందంగా తన పదవికి రాజీనామా చేయాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. నీట్ నిర్వహణలో ఘోర వైఫల్యానికి కారణమైన ఎన్‌టిఎను రద్దు చేయాలని కోరారు. నీట్‌లో అవకతవకలు, యుజిసి నెట్ 2024 రద్దు భావితరంపై తీవ్ర ప్రభావం చూపనున్నాయని ఆవేదన వెలిబుచ్చారు. . ప్రశ్నాపత్రాల లీకేజీ కుంభకోణాలను నిరసిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి కార్యాలయం వద్ద ఎస్ఎఫ్ఐ తదితర విద్యార్థి సంఘాలు చేపట్టిన ఆందోళనకు సంఘీభావం తెలిపారు. పరీక్షల నిర్వహణలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) విఫలమైన నేపథ్యంలో . ఎన్నో ఆశలతో ఏళ్ల తరబడి కష్టపడి చదివిన విద్యార్థుల భవిష్యత్ అగమ్యగోచరం, నాశనమౌతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యమా లేక మరే కారణం ఉన్నా సమగ్ర విచారణ జరపాలని, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును సర్వనాశనం చేస్తున్న బిజెపి విధానాలు మార్చుకోవాలన్నారు.

రాయితీపై వరి విత్తనాల పంపిణీ


వరి విత్తనాలను పంపిణీ చేస్తున్న కూటమి నేతలు

ప్రజాశక్తి -అనకాపల్లి : మండలంలోని పెంకుపాలెం సచివాలయంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సూచనల మేరకు ఆదివారం రైతులకు సబ్సిడీ వరి విత్తనాలు పంపిణీ చేశారు. కూటమి నాయకులు దొడ్డి సూరిబాబు, ఆడారి నారాయణరావు, ఆడారి సాంబశివరావు, బుద్ధ చిరంజీవి బుద్ధ శివ నాయుడు, పోలమరశెట్టి నరసింగరావు, బి సెట్ శ్రీనివాసరావు, కట్టా దుర్గారావు, రేఖ రమణమూర్తి టి. ప్రకాష్ కూటమి లీడర్లు పాల్గొని రైతులకు వరి విత్తనాలు అందజేశారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ సమీపంలో పూజలు అందుకుంటున్న అభయాంజనేయ స్వామి ఆలయ షష్టమ వార్షికోత్సవం ఆదివారం భక్తిశ్రద్ధలతో జరిగింది. స్థానిక విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వార్షికోత్సవానికి పరిసర వీధుల్లోని మహిళలు, భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు మధ్యాహ్నం అన్నసమారాధన, రాత్రికి భజనా కార్యక్రమం నిర్వహించారు.

వర్షంతో ఉపశమనం


తాళ్లపాలెంలో కురుస్తున్న వర్షం

ప్రజాశక్తి - కశింకోట : మండలంలో తాళ్లపాలెం పరిసర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం భారీ వర్షం కురిసింది. ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు ఉపశమనం కలగడంతోపాటు, వర్షాలతో వ్యవసాయ పనులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఖరీఫ్‌లో సాగు సన్నద్ధతలో భాగంగా దుక్కులకు లాభిస్తుందని అంటున్నారు.

ప్రారంభించి నాలుగేళ్లయినా నిరుపయోగం!


కె.కోటపాడులోని ప్రభుత్వ బాలికల హాస్టల్ భవనం

ప్రజాశక్తి- కె.కోటపాడు : ప్రారంభోత్సవం జరిగి నాలుగేళ్లయినా నేటికీ వినియోగంలోకి రాకపోవడంతో మండల కేంద్రం కె.కోటపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోని బాలికల వసతిగృహం నిరుపయోగంగా మారింది. కేంద్ర ప్రభుత్వ ఆర్ఎంఎస్ఎకు చెందిన రూ.1.94 కోట్ల నిధులతో ఈ భవనాన్ని సర్వాంగ సుందరంగా నిర్మించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అనుబంధంగా ఈ ప్రభుత్వ బాలికల వసతి గృహాన్ని నిర్మించారు. అప్పటి ప్రభుత్వ విప్ బూడి ముత్యాలనాయుడు 2020 సెప్టెంబర్ 5న ప్రారంభించారు. అయితే నేటి వరకు వినియోగంలోకి రాకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. కె.కోటపాడు మండల పరిసర గ్రామాల బాలికల విద్యకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందనే ఉద్దేశ్యంతో నిర్మించిన ఈ హాస్టల్ భవనాన్ని నేటికీ వినియోగంలోకి తేకపోవడంతో పలువురు బాలికలు హైస్కూల్ విద్యకు నోచుకోని పరిస్థితి ఉంది. నాలుగేళ్లుగా ఈ భవనంనిరుపయోగంగా ఉండటంతో ఆకతాయిలు అడ్డాగా మారడంతోపాటు భవనం కిటికీలు విరిచి, లోపలి ఫ్యాన్లు, లైట్లు, స్టీలు సామగ్రి చోరీకి గురైన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు, నేతలు దృష్టి సారించి ఈ ప్రభుత్వ బాలికల వసతి గృహాన్ని విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు

అందుబాటులోకి రాని ప్రభుత్వ బాలికల హాస్టల్
చోరీకి గురౌతున్న భవనంలోని సామగ్రి, పరికరాలు
పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్రమాదపుటంచున పసివాళ్ల ప్రయాణం


పరిమితికి మించిన లోడుతో ఆటోలో వెళుతున్న చిన్నారులు

స్కూలు ఆటోలపై రవాణా అధికారులు దృష్టి సారించాలి

ప్రజాశక్తి - యలమంచిలి : సమయానికి పిల్లల్ని బడులకు చేర్చేయత్నంలో తల్లిదండ్రులు ఆటోలపై చూపుతున్న శ్రద్ధ వాటి కండిషన్ గురించిగానీ, వారు ఏవిధంగా వెళ్లివస్తున్నారనే విషయంపైగానీ పట్టించుకోవడం లేదని పలు సందర్భాల్లో స్పష్టమౌతోంది. ఎక్కువ మంది పిల్లల్ని ఎక్కిస్తే మరింత ఆదాయం వస్తుందని ఆటోడ్రైవర్లు పడుతున్న తాపత్రయానికి, తల్లిదండ్రుల అలసత్వం తోడై బడికి వెళ్లే పిల్లల ప్రయాణాలు ప్రమాదకరంగా మారుతున్నాయనే ఆరోపణలూ ఉన్నాయి ఆటోకు రెండువైపులా పుస్తకాల సంచుల్ని, టిఫిన్ బాక్సుల్ని తగిలించి రోడ్డుమీద రయ్ మంటూ గతుకుల రోడ్లమీద ఆటోడ్రైవర్లు దూసుకుపోతున్నారు. పిల్లల్ని ఆటోల్లో వస్తువుల్లా కుక్కి బడులకు తీసుకెళ్లే దృశ్యాలు సర్వసాదారణ మయ్యాయి.

పాఠశాలల బస్సుల సమాచారం అధికార్ల దగ్గర ఉండడంతో స్కూళ్లు తెరిచేనాటికి వాటిని పరిశీలించి రవాణాశాఖ అనుమతులు జారీచేయడం ఆనవాయితీ. అయితే సూళ్లకు తిరుగుతున్న ఆటోల వివరాలు నమోదు ఉండదు కాబట్టి ప్రమాదాలు జరిగినప్పుడే శిక్షలు, నిబంధనల గురించి ఆలోచిస్తుంటారు.

నిబంధనల ప్రకారం ఆటోలో ఆరుగురికి మించి ఎక్కించకూడదు. డ్రైవరు పక్కన అసలు కూర్చోకూడదు. స్కూలు ఆటోలకు సైడు రాడ్లు అమర్చాలి. పిల్లల్ని తీసికెళ్లే ఆటోల్లో ప్రథమ చికిత్స కిట్ తప్పనిసరి. ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి. పొల్యూషన్, ఇన్సూరెన్స్ సర్టిఫికేట్లు ఉండాలి. డ్రైవర్ యూనిఫారం ఉండాలి. నిబంధనలు పాటించని ఆటోడ్రైవర్ల తనిఖీల్లో పట్టుబడిపుడు భారీ శిక్షలు, జరిమానాలు పడతాయి. పిల్లల్ని పంపుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం ఎప్పటికప్పుడు ఆటో డ్రైవర్లను ఓ కంట కనిపెడుతుండాలి. వారి ప్రవర్తన పట్ల కూడా పిల్లల్ని అడిగి తెలుసుకుంటుండాలి. నిబంధనలు పాటించేలా తల్లిదండ్రులు చూసుకోవాలి. డ్రైవర్లు కూడా బాధ్యతగా మెలిగేట్లు అధికార్లు కూడా తనిఖీలు ముమ్మరం చేయాలి. ఇవన్నీ తల్లిదండ్రులు, అధికారులు చేయాల్సిన కర్తవ్యాలే అయినా, వీటిలో చాలా గాలికొదిలేస్తున్నారంటే అతిశయోక్తి కాదు.



చెరువును తలపిస్తున్న ఎఎల్ పురం బస్ స్టేషన్ ఆవరణ

పరిశ్రమల ఏర్పాటుపై.. ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలి

ప్రజాశక్తి-నక్కపల్లి:ఆంధ్రప్రదేశ్ కోస్టల్ జోన్ మేనేజ్మెంట్ అథారిటీ ప్రచురించిన నోటిఫికేషన్‌కు సంబంధించి, సిఆర్‌జెడ్ పరిధి గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించిన తర్వాత ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు డిమాండ్ చేశారు. 2019 సిఆర్‌జెడ్ నోటిఫికేషన్ కింద నక్కపల్లి, పాయకరావుపేట, రాంబిల్లి, ఎస్.రాయవరం, అచ్యుతాపురం, పరవాడ మండలాలకు సంబంధించి సిఆర్‌జెడ్ ముసాయిదాపై వచ్చే నెల జులై 23న అనకాపల్లి కలెక్టర్ కార్యాలయంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ కోస్టల్ జోన్ మేనేజ్మెంట్ అథారిటీ, కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రకటన ఇచ్చారన్నారు. దీనిపై ముందుగా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఇప్పటికే సిఆర్‌జెడ్ ప్రాంతాల్లో హెటిరో డ్రగ్స్, డెక్కన్, పరవాడలో ఫార్మా సిటీ వంటి కాలుష్యం కలిగిస్తున్న పరిశ్రమలు ఉన్నాయని, 2011/2019 సిఆర్ జెడ్ నోటిఫికేషన్ల అమలు తేదీ నుంచి నిషేధించబడినా ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇటువంటి పరిశ్రమలతో జల వనరులు, కాలుష్యానికి గురై ప్రజల ఆరోగ్యానికి హాని కలుగుతుందన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన పరిశ్రమలకు కఠినమైన పెనాల్టీలు వేయడమే కాకుండా, ప్రజలకు తగిన నష్టపరిహారం వారిచేత ఇప్పించాలని కోరారు. వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో ప్రభుత్వం సేకరించిన భూములలో కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ప్రయత్నిస్తుందన్నారు. కాలుష్యం కలిగించే యూనిట్లను వెంటనే రద్దు చేయాలన్నారు. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, ఏపీసి జెడ్ ఎమ్ఏ వారు 2011/2019 సి ఆర్ జెడ్ నోటిఫికేషన్లను చిత్తశుద్ధితో అమలు చేసి ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వం ఏకపక్షంగా ముందుకు పోకుండా ఆయా గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి.దేముడునాయుడు, ఎం.రాజేష్, కె.సోమునాయుడు, బి.నాగేశ్వరరావు, సిహెచ్.శివాజీ, ఎం.బైరాగిరాజు, రామకృష్ణ ఎం.రమణ, నారాయణ, కాశీ, మనబాల అప్పలరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం నేత అప్పలరాజు

గొలుగొండలో భారీ వర్షం

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలో ఆదివారం తెల్లవారుజాము నుంచి ఉదయం 10 గంటల వరకు భారీ వర్షం కురిసింది. దీంతో, పలు గ్రామాల్లో డ్రైనేజీ లేక పోవడంతో వర్షపు నీరంతా రోడ్ల పైన నిలిచి పోయింది. ఏఎల్ పురం బస్ స్టేషన్ ఆవరణ అంతా వర్షపు నీరు నిలిచిపోయి చెరువుని తలపించింది. ఏ ఎల్ పురం లో పలు వీధుల్లో డ్రైనేజీలు సక్రమంగా లేకపోవడంతో వర్షపు నీరు మురికి నీటితో కలిసి రోడ్లపై నిలిచిపోయింది దీంతో ప్రజల తీవ్ర ఇబ్బందులు పడ్డారు .భారీ వర్షం కురవడంతో దారమటం జలపాతం ఉధృతంగా ప్రవహించింది. ఈ వర్షం పూర్తి స్థాయిలో వ్యవసాయ పనులకు అనుకూలంగా ఉంటుందని హర్షం వ్యక్తం చేశారు.



మృతి చెందిన గేదె

విద్యుదాఘాతంతో గేదె మృతి

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని రమణయ్యపేట లో పాడి రైతు సిహెచ్ పోలయ్యకు చెందిన గేదె విద్యుత్ షాక్ కు గురై మృతి చెందింది. పోలయ్య గేదెలు మేపుతుండగా వేలాడుతున్న విద్యుత్తు తీగలు తగలడంతో సుమారు 80 వేల రూపాయల విలువైన పాడిపశువు విద్యుత్ షాక్ గురై మృతి చెందడంతో పాడి రైతుకు తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరాడు .

వాసవి వనితా క్లబ్ ఆధ్వర్యాన సేవలు

ప్రజాశక్తి -కొత్తకోట:కొత్తకోట వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో డాన్ టు డస్క్ ప్రోగ్రాం కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది వాసవి వనితా క్లబ్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో భాగంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ ఇంటర్నే షనల్ సభ్యుల నిధులతో ఐదుగురు చిరు వ్యాపారులకు గొడుగులు, 20 మంది విద్యార్థులకు స్టేషనరీ కిట్, నోట్ బుక్స్ పెన్స్, పెన్సిల్స్ తంఅందజేశారు. ట్రాఫిక్ పోలీసులకు మాస్కులు, టవల్స్ వితరణగా అందించారు. స్థానిక శివ కేశవ ఆలయంలో తాగునీటి అవసరాలకు సుమారు రెండు వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంక్, గోడ గడియారం సమకూర్చారు. ఉత్తమ సేవలు అందిస్తున్న కొత్తకోట ఎస్సై లక్ష్మణరావు, సిబ్బందిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా అమలాపురంకు చెందిన వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ మల్టీ ప్లే డైరెక్టర్ మురళీకృష్ణకుమార్, జోన్ చైర్మన్లు టి.అయ్యప్ప, కె.వెంకటకృష్ణ, వై.పరమేశ్వరరావు, వాసవి వనిత క్లబ్-కొత్తకోట శాఖ అధ్యక్షులు కేదారిశెట్టి లావణ్య, ఉపాధ్యక్షులు కడిమిశెట్టి దేవి, కార్యదర్శి పెంటపాటి జ్యోతి,ట్రెజరర్ గెల్లి మణి, చార్టర్ ప్రెసిడెంట్ నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలు అందుకున్న చిన్నారులతో సభ్యులు



కిట్ అందజేస్తున్న నాయకులు

క్రికెట్ కిట్ అందజేత

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని ఉపమాక పంచాయతీ మనబాలవానిపాలెం గ్రామానికి చెందిన క్రికెట్ క్రీడాకారులకు క్రికెట్ కిట్ అందజేసారు. నక్కపల్లి లో జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం జనసేన పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పాము గణేష్ చేతుల మీదుగా క్రికెట్ క్రీడాకారులకు కిట్ అందజేశారు.ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివ దత్ సూచనల మేరకు క్రీడాకారులకు క్రికెట్ కిట్ అందజేయడం జరిగిందన్నారు. క్రీడారంగంలో రాణించాలన్నారు .

ఉపాధి కల్పించేనా...

- పనులు లేక వలసబాట
- సాగును వదులుతున్న రైతులు
- పరిశ్రమల ఏర్పాటుపై ఎన్నికల్లో కూటమి నేతలు హామీ
- అమలుపై ప్రజల్లో చర్చ



ప్రజాశక్తి-కోటవురట్ల:పాయకరావుపేట నియోజక వర్గం పరిధిలో కోటవురట్ల మండలం ఆర్థికంగా సామాజికంగా వెనకబడిన ప్రాంతం. మండల కేంద్రం వివిధ సామాజిక వర్గాలతో మమేకమైంది. ఇక్కడ ప్రజలు అధిక శాతం వ్యవసాయ ఆధారిత వనరులపై ఆధారపడి జీవిస్తూ ఉంటారు. మండల కేంద్రంలో ఎటువంటి కర్మాగారం, కార్మికులకు ఉపాధి అవకాశాలు లేవు. గ్రామస్తులు అధిక శాతం సన్న కారు రైతులు కావడంతో పాడి పంటలపై అధిక శాతం ఆధారపడి జీవనం సాగిస్తున్నారు.మండలం నుంచి నక్కపల్లి హేటిరో, అచ్యుతాపురం బ్రాండిక్స్, సమీపంలో జిడిపిక్కల కర్మాగారం వంటి కంపెనీలకు వెళ్లి పురుషులు, మహిళలు ఉపాధి పొందుతున్నారు. గతంలో ఏటికొప్పాక చెక్కర కర్మాగారం నుంచి అధిక శాతం ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి పొందేవారు. ప్రస్తుతం కర్మాగారం స్థానిక నాయకుల పుణ్యమా అని మూత పడిపోవడంతో ఆ ఉపాధి కూడా కరువైంది. దీంతో రైతులు, నిరుద్యోగులు, పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొందరు రైతులు, నిరుద్యోగులు వ్యవసాయం మానుకొని ఉద్యోగాలు వెతుక్కుంటూ సుదూర ప్రాంతాలకు వెళ్లి పోతున్నారు. కూలీలు వలసపై ఆధార పడటంతో కొత్త ప్రభుత్వం తమ బతుకులు మారుతాయని ఆశతో ఎదురు చూస్తున్నారు. గ్రామంలో అభివృద్ధి సైతం ఎక్కడ వేసిన గొంగళి అన్నచందంగా ఉంది. మండలంలో ఎక్కడా కనీసం చిన్న తరహా పరిశ్రమ కూడా లేకపోవడం విశేషం.

సహజ వనరులు ఇసుకను పలువురు ఎడ్ల బండి పై ఇతర ప్రాంతాలకు తరలిస్తూ ఉపాధి పొందుతున్నారు. ఇదిలా ఉండగా మండల కేంద్రం ప్రధాన రహదారి విస్తరణకు నోచుకోలేదు. ఇక్కడ వ్యాపారాలు సైతం అంతంత మాత్రమే కావడంతో నర్సీపట్నం ప్రాంతాలకు వెళ్లి వినియోగదారులు కొనుగోలు చేసుకుంటున్నారు. డిగ్రీ కళాశాల లేక పోవడంతో విద్యార్థులు వివిధ ప్రాంతాలకు వెళ్లి చదువుకుంటున్నారు. దీంతో, ఆర్థికంగా ఇబ్బంది పడుతూ చదువుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. పాలకులు మారుతున్నా ఉపాధి అవకాశాలు కనిపించ లేదు. పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పిస్తామని కూటమి నేతలు వాగ్దానాలు చేశారు. దీంతో, కొత్త ప్రభుత్వంపై కోటి ఆశలతో గ్రామస్తులు సహా మండల వాసులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

ప్రజల ఫిర్యాదులను పరిష్కరించండి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: ప్రజా ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని నర్సీపట్నం పన్ను చెల్లింపుదారుల సంక్షేమ సంఘం కార్యదర్శి కే.శివనారాయణరాజు ఆదివారం కోరారు. ప్రభుత్వం మారినప్పుడల్లా కార్యక్రమం పేరు మారుతుంది కానీ ప్రజా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. నూతన ప్రభుత్వం ప్రతీ సోమవారం ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలోనైనా సమస్యలు పరిష్కరించడంలో దృష్టి సారించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పిడుగు పడి నాలుగు పశువుల మృతి

ప్రజాశక్తి -అనంతగిరి:పిడుగు పాగుపాటుకు గురై నాలుగు దుక్కెద్దులు మృతి చెందిన ఘటన మండలం లో చోటు చేసుకుంది. ఈ నెల 22న శనివారం మధ్యాహ్నం భారీ పిడుగులతో వర్షం కురిసింది. దీంతో, మండలంలోని గరుగుబిల్లి పంచాయతీ పదపుతికవలస గ్రామానికి చెందిన ఓలుగు సింహాచలంకు చెందిన 3 పశువులు, రూడి సత్యనారాయణకు చెందిన ఒక్క దుక్కిటెద్దులు గ్రామానికి సమీపంలో మేత కోసం వెళ్లాయి. భారీ వర్షం కురవడంతో పశువులు సమీపంలో ఉన్న చెట్టు వద్దకు చేరాయి. ఆ సమయంలో పిడుగు పడటంతో మృతి చెందినట్లు రైతులు తెలిపారు. తక్షణమే ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరారు.



రోడ్డు పక్కన ఉన్న చెట్లు

రహదారికి ఇరువైపులా ఉన్న
ప్రమాదభరిత చెట్లను తొలగించరూ...

ప్రజాశక్తి - గొలుగొండ:మండలంలో నర్సీపట్నం- కేడీపేట ఆర్అండ్బి రోడ్డుకు ఇరువైపులా ప్రమాద భరితంగా ఉన్న చెట్లను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా పలుచోట్ల కొన్ని చెట్లు రోడ్డుపైకి ప్రమాద భరితంగా విస్తరించి ఉన్నాయి. రోడ్డుకిరువైపులా కాలం చెల్లిన చెట్లు కూడా ఉన్నాయి. ఈదురు గాలులకు, భారీ వర్షాలకు ఈ చెట్లు పడిపోయే ప్రమాదం పొంచి ఉంది. గత మూడు రోజులకు ఒక సారి కురుస్తున్న వర్షాలకి కేడీపేట, లింగంపేట గ్రామాల సమీపంలో పలు చెట్లు కూలి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడిన సంగతి తెలిసిందే. లింగంపేట వద్ద కూలిన చెట్టు కారుపై పడటంతో నుజ్జునుజ్జయింది. అప్పుడు కారులో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. రోడ్డుకి ఇరువైపులా ప్రమాద భరితంగా ఉన్న చెట్లను తొలగించాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

అయ్యన్నకాలనీలో చోరీ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం మున్సిపాలిటీ అయ్యన్న కాలనీలో జరిగిన దొంగతనంలో ఐదు తులాల బంగారం చోరీ జరిగినట్లు టౌన్ ఎస్సై ఉమామహేశ్వరరావు తెలిపారు. సూరిశెట్టి వెంకటరమణ అనే వ్యక్తి కుటుంబంతో సహా పండ్ల వ్యాపారం చేస్తుంటాడు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం కుటుంబ సభ్యులు వ్యాపారానికి వెళ్లి రాత్రి ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళం బద్దలు కొట్టి బీరువాలో నగలు ఎత్తుకెళ్లినట్లు ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై కేసు నమోదు చేయడం జరిగిందని చెప్పారు.

నేడు ఎంపీ తనూజారాణి ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-అరకులోయ:అరకు పార్లమెంటు సభ్యురా లుగా నూతనంగా ఎన్నికైన డాక్టర్ గుమ్మ తనూజారాణి ఈనెల 24న సోమవారం పార్లమెంట్‌లో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అరకు మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ కోడలు, వైసిపి రాష్ట్ర యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్ సతీమణి తనుజరాణి ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అరకు ఎంపీగా గెలుపొందారు. ఈ మేరకు ఆమె దేశ రాజధాని ఢిల్లీ పార్లమెంట్‌లో ఎంపీగా ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు ఆమె విలేకరులకు తెలిపారు. ఆమెకు వైసిపి శ్రేణులు అభినందనలు తెలిపారు. తనను గెలిపించిన అరకు నియోజకవర్గ ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.



నిరుపయోగంగా బోరు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మండల కేంద్రంలోని సంత వలస అంగన్వాడి కేంద్రంలో నిర్మించిన తాగునీటి బోరు గత కొన్ని నెలలుగా మరమ్మతుకు గురై నిరుపయోగంగా మారింది. దీంతో అంగన్వాడి కేంద్రంలో తాగునీటి సౌకర్యం లేక నిర్వాహకులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. అంగన్వాడి కేంద్రానికి వెళ్లే చిన్నారులకు పౌష్టికాహారాన్ని వండి పెట్టడానికి బయట నుంచి మంచినీళ్లు తీసుకు రావాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. గత కొన్ని నెలల నుంచి బోరు నిరుపయోగంగా ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు మరమ్మత్తు చేసి వినియోగంలో తీసుకు రావడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని స్థానిక గ్రామస్తులు అంటున్నారు. ప్రస్తుత ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో తాగునీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని అంగన్వాడి కేంద్రం వద్ద తాగునీటి బోరును మరమ్మత్తు చేపట్టకపోతే మారుమూల గ్రామాల్లో పరిస్థితి ఏ విధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చని పలువురు అంటున్నారు.

తరచూ....
విద్యుత్ సరఫరాలో అంతరాయం

- రోజులో గంటపాటు నిలకడగా ఉండని వైనం
-అవస్థలు పడుతున్న వినియోగదారులు

రావికమతం మండలం కొత్తకోట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అస్తమాను అంతరాయం ఏర్పడుతుండటంతో వినియోగదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గత మూడు నెలలుగా విద్యుత్ సరఫరా సక్రమంగా లేక పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజులో విద్యుత్ సరఫరా ఒక గంట పాటు నిలకడగా ఉంటే చాలు అనే ఆశతో వినియోగదారులు కాలం నెట్టు కొస్తున్నారు. వినియోగానికి సరిపడా విద్యుత్ సరఫరా లేక పోవడంతో పాటు అధికారుల నిర్లక్ష్య వైఖరి వినియోగ దారుల పాలిట శాపంగా మారింది.

ప్రజాశక్తి-కొత్తకోట:

100 కెవి కెపాసిటర్‌లతో కాకుండా 63 కెవి కెపాసీటర్‌లతో కాలం నెట్టు కోస్తుండటంతో పాటు ఇంటర్ లింకింగ్ వ్యవస్థను వృథాగా వదిలి వేయడంతో సమస్య మరింత జటిలం కాగా ఎడిషనల్ లోడ్ నివారణకు సామగ్రి ఏర్పాటుకు వసూలు చేసిన నిధులు ఏమయ్యాయో అన్న అనుమానాలు వినియోదారులలో నెలకొంది.

ఈ సబ్‌స్టేషన్ పరిధిలో మేజర్ పంచాయతీ కొత్తకోటతో పాటు మండలంలో చీమలపాడు శివారు కల్యాణపులోవ, జోగంపేట, తాటిపర్తి, రొచ్చుపనుకు, తదితర మరో 14 గిరిజన గ్రామాలుండగా జడ్. కొత్తపట్నం గంపవానిపాలెం, ధర్మవరం, దొండపూడి, కి త్తంపేట, మత్సవానిపాలెం, టి.అర్జాపురం, కొట్లాబిల్లి, గదబపాలెం, రామలపూడి, కొత్తూరు, పి.పొన్నవోలు, మర్రివలస, వమ్మవరం, కన్నంపేట, అలాగే రోలుగుంట మండలం కసిరెడ్డిపాలెం, జె.నాయుడుపాలెం, జగ్గంపేట, గుర్రాల పాలెం, దిబ్బలపాలెం, అడ్డసరం తదితర గ్రామాలకు ఈ సబ్ స్టేషన్ నుంచే విద్యుత్ సరఫరా అవుతోంది. ఈ పరిధిలో ఐదు వేల వరకూ గృహ వినియోగానికి విద్యుత్ మీటర్లు ఉన్నాయి. వాటి తో పాటు కొత్తకోటలో సుమారు 15 వరకూ విస్తర్ల, కంచాల తయారీ కుటీర పరిశ్రమలు, పిండి మిల్లులు, ఇతర వ్యాపార సంస్థలు, దుకాణాలు కూడా ఉన్నాయి. వీటి ద్వారా వందల మంది ఉపాధి పొందుతున్నారు...

ఇదిలా ఉండగా గత మూడు నెలలుగా స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా కు తరచూ తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఈ సబ్ స్టేషన్ పరిధిలో సుమారు 35 నుంచి 40 వరకు ట్రాన్స్ఫార్మర్లు ఉండగా అవి కూడా పాత కాలం నాటి కావడంతో తరచూ మరమ్మతుకు గురవుతున్నాయి. కొత్తకోట సబ్ స్టేషన్‌కు సుమారు 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెద్ద బొడ్డేపల్లి నుంచి విద్యుత్ స్టాండ్ బై సరఫరా కాగా పలు సమయాలలో ముందు జాగ్రత్త గా వడ్డాది సబ్ స్టేషన్ నుంచి (వయా రాజాం రావికమతం 40 కిలోమీటర్లు) విద్యుత్ సరఫరాను తీసు కుంటున్నారు.

పూర్తి స్థాయిలో బొడ్డేపల్లి నుంచి తీసుకుంటే కేవలం 12 కిలోమీటర్లు దూరం కాగా ఎక్కడ సమస్య వచ్చినా అత్యవసరంగా సరి దిద్దుకునే వెలుసు బాటు ఉంటుంది.. కానీ స్థానిక సిబ్బంది వడ్డాది సబ్ స్టేషన్ పై కూడా ఆధార పడటంతో రాజాం, రావికమతం సబ్ స్టేషన్ మీదుగా (సుమారు 40 కిలోమీటర్లు దూరం) విద్యుత్ సరఫరా తీసుకోవడంతో లోవోల్టేజి సమస్యతో పాటు ఎక్కడ సమస్య వచ్చినా గుర్తించి పరిష్కరించలేని పరిస్థితి నెలకొంటుంది. ఏ ట్రాన్స్ ఫార్మర్ పరిధిలో సమస్య వచ్చినా మొత్తం సబ్ స్టేషన్ లో (ఎల్ సి) విద్యుత్ సరఫరా నిలిపి పనులు చేయాల్సిన పరిస్థితి దాపరించింది.కొత్తకోట లో సమస్య వచ్చినా దొండపూడి లో విద్యుత్ సరఫరా నిలిచి పోతోంది.

సిబ్బంది కొరత

సబ్ స్టేషన్ లో సిబ్బంది కొరత ఉంది. లైన్ ఇన్స్పెక్టర్, లైన్ మెన్ మాత్రమే ఉన్నారు. అసిస్టెంట్ లైన్ మెన్ ఏడాది కిందట బదిలీ అయ్యారు. అ స్థానాన్ని ఇప్పటి వరకూ భర్తీ చేయలేదు. అత్యవసర పరిస్థితిలో ప్రయివేట్ సిబ్బందిని వినియోగించి పనులు చేయిస్తున్నారు..



కొత్తకోట సబ్ స్టేషన్

పొంచివున్న ప్రమాదం

- తుప్పు పట్టిన విద్యుత్ స్తంభాలు
-ఆందోళనలో బూరువలస గ్రామస్తులు

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోని పట్టాం పంచాయతీ బూరువలస గ్రామంలో విద్యుత్ స్తంభాలు కింది భాగం తుప్పు పట్టి ఉన్నా పట్టించుకునే నాథుడే లేదు.దీంతో, ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. 2007లో బూరువలస గ్రామంలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. సుమారు 17 ఏళ్లు కావడంతో విద్యుత్ స్తంభాల కింద భాగం దెబ్బతిన్నాయి. ప్రస్తుతం వర్షాలకు గాలి వీయడంతో చుట్టూ పక్కన ఉన్న ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామానికి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నిత్యం మరమ్మతుకు గురవుతోంది.విద్యుత్ శాఖ అధికారులు స్పందించి నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు రాజారావు, బి.బుద్రన్న, కె.నూకరాజు, బి.చిన్నయ్య కోరుతున్నారు.



దెబ్బతిన్న విద్యుత్ స్తంభం కింద భాగం



తుప్పు పట్టిన స్తంభం